ప్రజాశక్తి

బుధవారం 3 డిసెంబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం




అనకాపల్లి

చాపకింద నీరులా స్క్రబ్ టైఫస్

◆ ఉమ్మడి విశాఖలో పెరుగుతున్న కేసులు

◆ అప్రమత్తత కీలకం : వైద్యులు



ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజలను స్క్రబ్ టైఫస్ వ్యాధి భయపెడుతోంది. వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల, దూరపు ప్రయాణాలు చేసి వచ్చిన వారిలో ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తుండటం ఆందోళనకరంగా మారింది. ఆగస్టు నుంచి ఈ తరహా వ్యాధితో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇప్పటికే విశాఖ నగరంతో పాటు ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో మూడు నెలల వ్యవధిలో సుమారు 300 కేసులు నమోదైనట్టు తెలుస్తోంది. ఈ బ్యాక్టీరియా బారిన పడిన వారు రాష్ట్రంలో చిత్తూరు, కాకినాడ తరువాత విశాఖలోనే ఎక్కువ మంది ఉన్నట్టు గణాంకాలు చెబు తున్నాయి.

వాస్తవంగా ఈ వ్యాధి సోకినప్పుడు లక్షణాలు సాధారణంగా కీటకం కుట్టిన 6 నుంచి 21 రోజుల్లోపు కనిపిస్తాయి. సరైన సమయంలో వ్యాధి లక్షణాలను గుర్తించకపోతే తీవ్రమైన పరిణామాలు ఎదురవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. స్క్రబ్ టైఫస్‌కు చికిత్స అందించడంలో ఆలస్యం ప్రాణాంతకం కావచ్చునని ప్రముఖ ఫిజిషియన్ వైద్యులు డాక్టర్ కె.రాంబాబు అంటున్నారు. ఆకస్మికంగా వచ్చే జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే చికిత్స ప్రారంభిస్తే త్వరగా నయం చేయవచ్చునంటున్నారు. కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి ఈ వ్యాధిపై మాట్లాడుతూ స్క్రబ్ టైఫస్‌పై ప్రజలెవరూ భయాందోళన చెందనవసరం లేదన్నారు. కెజిహెచ్‌లో ఈ వ్యాధి నివారణకు అవసరమైన అన్ని రకాల మందులు ఉన్నాయన్నారు. 'స్క్రబ్ టైఫస్ కీటకం కుట్టినప్పుడు జ్వరం, తలపోటు, కండరాల నొప్పులు, శోషరస కణుపుల వాపు, వినికిడి తగ్గడం, దగ్గు, శ్వాస ఆడకపోవడం వంటి లక్షణాలు కనబడతాయి. కీటకం కుట్టకుండా జాగ్రత్త పడటం ఒకటే నివారణ మార్గం. పొదలు, తోటలు, వ్యవసాయ క్షేత్రాలు, తడి నేల ఉన్న ప్రదేశాల్లోకి వెళ్ళేటప్పుడు కాళ్ళ చేతులు పూర్తిగా కప్పే దుస్తులు ధరించాలి. ఇంటి పరిసరాల్లో గడ్డి పెరగకుండా చూసుకోవాలి. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. పాతబడిన దుప్పట్లు, బొంతలు, పరుపులకు దూరంగా ఉండాలి. వాటిని ఎప్పటికప్పుడు శుభ్రపరిచి ఎండ తగిలేలా ఉంచాలి' అని చెప్పుకొచ్చారు. ఈ వ్యాధికి చికిత్స ప్రారంభించిన 24 గంటల నుంచి 48 గంటలలోపు రోగులు కోలుకోవడం మిగతా 2లో..

ప్రాణాంతకం కాదు : డిఎంహెచ్‌ఒ

వార్త 4లో..

హార్బర్ ఆధునీకరణ పనులు వేగవంతం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఫిషింగ్ హార్బర్ ఆధునీకరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఫిషింగ్ హార్బర్ హై లెవెల్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. హార్బర్ ఆధునికీకరణ పనుల ప్రగతి, హార్బర్ పరిశుభ్రత, వసతులపై హరేంధిర ప్రసాద్ సమీక్షించారు. విశాఖపట్నం పోర్టు అథారిటీ చీఫ్ ఇంజినీర్ శ్రీరామచంద్రమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కరుణ్ కుమార్ పనుల ప్రగతిని నివేదించారు. పనులు సత్వరం, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. హార్బర్‌లోగల ట్రాఫిక్, పరిశుభ్రత, నీటి సరఫరాపై పోర్ట్ అధికారులతో సమన్వయం చేసుకొని సక్రమంగా జరిగేటట్లు చూడాలని మత్స్యశాఖ జెడి పి.లక్ష్మణరావును ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఎంపెడా డిడి మొహంతి, ఇఐసి ఎడి సుధాన్సు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఎమ్ఆర్.ఆశాజ్యోతి, రెవెన్యూ, పోలీస్, పోర్టు ట్రాఫిక్ విభాగం, జివిఎంసి అధికారులు, బోటు ఆపరేటర్స్ ప్రతినిధులు ఎం.లక్ష్మణరావు, సిహెచ్.వీరన్న, బి.కొండ బాబు, బాలాజీ, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

'తృప్తి' నిబంధనల ఉల్లంఘనపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి పరిధిలోని రామకృష్ణ బీచ్ సమీపాన కొత్తగా ఏర్పాటు చేసిన 'తృప్తి' క్యాంటీన్‌పై నిబంధనల ఉల్లంఘన ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిని వెంటనే నిలుపుదల చేయాలని కోరుతూ స్థానిక చిరు వ్యాపారులు, ప్రజాప్రతినిధులు ఎన్‌టిఆర్ వైద్య సేవా ట్రస్టు చైర్మన్ సీతంరాజు సుధాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. డ్వాక్రా మహిళలను ముందు పెట్టి, సంబంధం లేని వ్యక్తులు క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నారని, ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా తమకు నచ్చిన ధరలకు, నచ్చిన పదార్థాలను అమ్ముతున్నారని ఫిర్యాదు చేశారు. క్యాంటీన్‌కు కేటాయించిన స్థలం కంటే అదనంగా దాదాపు 30 అడుగుల స్థలాన్ని ఆక్రమించారని, జివిఎంసికి ఎటువంటి రుసుమూ చెల్లించడం లేదని ఆరోపించారు. 20 ఏళ్లుగా జివిఎంసి గుర్తింపుతో వ్యాపారం చేసుకుంటున్న చిల్లర వ్యాపారులకు ఈ పెద్ద కంటైనర్ దుకాణం వల్ల తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వినతిపత్రాన్ని జివిఎంసి కార్పొరేటర్ ఉరుకుటి నారాయణ, సంఘం పెద్దలు సిహెచ్.రమణ తిరుమలరావు, తెడ్డు శంకర్, సిహెచ్.సత్య, ప్రసాద్ కలిసి సుధాకర్‌కు అందజేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, చిరు వ్యాపారులకు న్యాయం చేయాలని వారు కోరారు.

విశాఖ ఎయిర్‌పోర్టును కొనసాగించాలి

▶ వార్త 2లో..

పెంచలయ్య హత్యపై నిరసన

▶ వార్త 8లో..

ఎన్నికల హామీల అమలులో నిర్లక్ష్యం

▶ వార్త 8లో..

4 నుంచి ఆర్గానిక్ మేళా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే ఆర్గానిక్ మేళాను జయప్రదం చేయాలని, ప్రకృతి వ్యవసాయ రైతుల పంటల ప్రదర్శనకు తరలిరావాలని భారతీయ కిసాన్ సంఘం జాతీయ కార్యదర్శి జలగం కుమారస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ మేళాను ప్రారంభించేందుకు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విచ్చేస్తున్నారన్నారు. 6న ఎంఎస్ఎంఇ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు వస్తున్నారన్నారు. ఈ మేళాను ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, వారాహి ఫెడరేషన్, హలో వైజాగ్, టెర్రస్ గార్డెన్ గ్రూప్‌లు, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జిఒ, అగ్రి డిఎన్ఎ వెంచర్స్ సంస్థల నేతృత్వంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, కార్యదర్శి పాలెం నేచురల్స్ అశోక్, ప్రకృతి రైతులు రిషీ, ఎన్.నరేంద్ర, పర్యావరణ ప్రముఖ్ రంగాచార్యులు, యోగ భారతి ప్రతినిధి పైడం నాయుడు, గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

లోకో పైలట్ల సమస్యలు పరిష్కరించాలి

48 గంటల దీక్ష ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తమ సమస్యలను పరిష్కరించాలంటూ రైల్వే లోకో పైలట్లు విశాఖలోని దొండపర్తి డిఆర్ఎం కార్యాలయం వద్ద ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన 48 గంటల నిరాహార దీక్షా కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ దీక్షలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ రైల్వేను ప్రైవేటుపరం చేసేందుకు మోడీ సర్కారు ప్రయత్నిస్తోందన్నారు. ఈ క్రమంలోనే ఉద్యోగ ఖాళీలను ఏళ్ల తరబడి భర్తీ చేయడం లేదన్నారు. పలు రైల్వే విభాగాలను ఈసరికే ప్రైవేటీకరణ చేసేశారని తెలిపారు. యజమానులకు అనుకూలంగా మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను వ్యతిరేకించాలన్నారు. డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్‌కెఎస్‌వి.కుమార్ మోడీ సర్కారు విధానాలతో లోకో రన్నింగ్ సిబ్బంది సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయన్నారు. లోకో పైలట్ల నిరాహార దీక్షకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. ఐఎల్ఆర్ఎస్ఎ ప్రెసిడెంట్ ఎస్‌పి.పాణిగ్రాహి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ వాల్తేరు డివిజనల్ కార్యదర్శి ఎ.భోలానాథ్ మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే ఉపసంహరించాలన్నారు. 2024 జనవరి 1 నుండి టిఎ రేట్ల పెంపు మాదిరిగా కిలోమీటర్స్ అలవెన్స్‌లో 25 శాతం పెంపుదల మిగతా 2లో..



దీక్షలో కూర్చున్న నర్సింగరావు, కుమార్, లోకో పైలట్లు

మొదటి పేజీ తరువాయి..

లోకో పైలట్ల సమస్యలు పరిష్కరించాలి

చేయాలన్నారు. కిలోమీటర్ల అలవెన్స్‌లో 70 శాతాన్ని ఆదాయపు పన్ను నుండి మినహాయించాలన్నారు. రన్నింగ్ సిబ్బంది టర్న్ అరౌండ్ లేదా హెడ్ క్వార్టర్‌కు దూరంగా ఉండే సమయం 48 గంటలలోపు ఉండేలా చర్యలు తీసుకోవాలని, తదుపరి దానిని 36 గంటలకు తగ్గించాలని అన్నారు. క్రూ నైట్ డ్యూటీని వరుసగా రెండు రాత్రులకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. రన్నింగ్ సిబ్బందికి 10 గంటలకంటే మించిన డ్యూటీ ఆపాలన్నారు. తదుపరి దానిని 8 గంటలకు తగ్గించాలన్నారు. 46 గంటలు కాలానుకూల విశ్రాంతి పాటించాలన్నారు. లోకో క్యాబ్‌లలో టూల్ బాక్స్, ఎస్ఎఫ్‌డిని అమర్చాలన్నారు. వాల్తేరు డివిజన్‌కు సంబంధించి లోకో పైలట్లను 12 గంటల డ్యూటీకి వినియోగించడం, కేవలం 12 గంటల ట్రిప్పు రెస్ట్ మాత్రమే ఇవ్వడం వెంటనే ఆపాలన్నారు. సింహాచలం నార్త్, విజయనగరం వద్ద హెడ్ క్వార్టర్స్, రిలీఫ్ పాయింట్‌ను బైపాస్ చేయడం నిలిపివేయాలన్నారు. డిపిడబ్ల్యూసిఎస్ లోటస్ లోకో పేరిట అసిస్టెంట్ లోకో పైలట్ లేకుండా ట్రైన్లు నడిపించడం ఆపాలన్నారు. ఒకే ట్రైన్ ఆర్డర్‌లో బహుళ ట్రైన్లను నడిపించే విధానాన్ని నిలిపివేయాలన్నారు. రాయగడ రన్నింగ్ రూమ్‌లో కాంట్రాక్టర్‌ను ప్రోత్సహించే విధంగా అమలు చేస్తున్న ఫిక్స్‌డ్ మీల్స్ సిస్టమ్‌ను రద్దు చేయాలన్నారు.

చాపకింద నీరులా స్క్రబ్ టైఫస్

మొదలవుతుందని వైద్యులు చెబుతున్నారు. మళ్లీ రాకుండా ఉండేందుకు యాంటీ బయాటిక్స్ కోర్సును వైద్యుల సిఫార్సు మేరకు పూర్తిగా తీసుకోవడం ముఖ్యమంటున్నారు. గర్భిణుల్లో అజిత్రో మైసిన్‌ను ప్రత్యామ్నాయంగా వాడొచ్చునంటున్నారు.

స్క్రబ్ టైఫస్ అంటే ఏమిటి?

స్క్రబ్ టైఫస్ అనేది ఓరియంటియా సట్సుగముషి అనే బ్యాక్టీరియా వల్ల వచ్చే వ్యాధి. ఇది నల్లిని పోలి ఉండే చిన్న కీటకం. అతి చిన్న పురుగుల లార్వాలతో మనుషులకు వ్యాపిస్తుంది. ఈ పురుగులు సాధారణంగా పొదలు, గడ్డి, అటవీ ప్రాంతాలు, తోటలు, చెత్తాచెదారం ఉన్న ప్రదేశాలలో కనిపిస్తాయి. పొలాల్లో పనిచేసేవారు, తోటల పెంపకందారులు, గ్రామీణ ప్రాంతాల్లో నివసించేవారు ఈ వ్యాధి బారినపడే ప్రమాదం ఎక్కువుగా ఉంటుంది.

వ్యాధి లక్షణాలివే..

చర్మం ఎరుపెక్కి దద్దుర్లు వస్తుంటాయి. వణుకు లక్షణాలు కనిపిస్తాయి. శరీరంపై నల్లని మచ్చలు ఏర్పడతాయి. వ్యాధి సోకిన తర్వాత దగ్గు, జ్వరం, జలుబు, నీరసం లక్షణాలు కనిపిస్తాయి. కొందరికి ప్లేట్లెట్స్ తగ్గిపోవడంతో పాటు జ్వరం తీవ్రత పెరుగుతుంది. ఊపిరితిత్తుల సమస్యలు ఏర్పడతాయి. రక్తం గడ్డకట్టడం, పచ్చకామెర్లు వంటి ఇబ్బందులు కూడా తలెత్తే ప్రమాదాలున్నాయి. మెదడుపై ప్రభావం చూపకముందే ఈ వ్యాధి సోకిన వారిని వైద్యుల పరిశీలనలో ఉంచడం మంచిది.

వేడి ఆహారం, లిక్విడ్స్ తీసుకోవాలి

ఈ వ్యాధి బారిన పడిన వారు సకాలంలో మంచి పౌష్టికాహారంతో పాటు జ్యూస్‌లు అధికంగా తీసుకోవాలి. శాఖాహారం మాత్రమే తినాలి. మసాలా ఆహార పదార్థాలు, మాంసం తినరాదు. కొబ్బరి నీళ్లు, పండ్ల జ్యూస్‌లు అధికంగా తీసుకుంటూ డీహైడ్రేషన్ కాకుండా తగిన చర్యలు తీసుకోవాలి. అదే విధంగా చిన్నారులు, గర్భిణులు మరింత అప్రమత్తంగా ఉండాలి. వేడి ఆహారం తీసుకోవాలి. చిన్నపాటి జ్వర లక్షణాలు, ఇతర లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి. ఈ వ్యాధి సాధారణంగా వారం రోజుల్లో తగ్గిపోతుంది. పెద్ద ప్రమాదం ఏమీకాదు. అయినా శుభ్రత పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలి. స్క్రబ్ టైఫస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాపించదు.

కాలుష్య నివారణ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జాతీయ కాలుష్య నివారణ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం కోరారు. మంగళవారం విశాఖపట్నంలోని పెద జాలారి పేటలో ఎఎస్.రాజా మహిళా జూనియర్ కళాశాల విద్యార్థులు బీచ్ క్లీనప్ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ కాసు నేతృత్వంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌లు సుశీల, స్వాతిల పర్యవేక్షణలో నిర్వహించారు.

అనంతరం జరిగిన సమావేశంలో రత్నం మాట్లాడుతూ కాలుష్యం నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఒక్కసారి వాడి వదిలేసే ప్లాస్టిక్ వద్దే వద్దన్నారు. కార్యక్రమంలో ఏక్షన్ ఎయిడ్ కర్ణాటక ప్రాజెక్ట్స్ అనకాపల్లి హెచ్ఆర్‌డి ఐ.కృష్ణకుమారి తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎపి పిసిబి, కోరమాండల్ ఫెర్టిలైజర్స్, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జిఒలు అందజేసిన గుడ్డ సంచులు విద్యార్థులకు పంపిణీ చేశారు, ఇంటింటికీ వంగ, టమాటా, పచ్చిమిర్చి, పచ్చి మిర్చి మొక్కలు అందించారు. ఒక్క సారి వాడి వదిలేసే ప్లాస్టిక్ వద్దే వద్దు అన్న నినాదాలతో ఊరేగింపు నిర్వహించారు.

ఐఐఎం విశాఖతో ఐఎస్ఎఫ్‌బి భాగస్వామ్యం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం ఐఐఎంతో ఐఎస్ఎఫ్‌బి భాగస్వామ్యం కుదుర్చుకుందని, ఇది అండర్ గ్రాడ్యుయేట్, గ్రాడ్యుయేట్లకు ఎంతో ప్రయోజనకరమని ఐఎస్ఎఫ్‌బి సిఇఒ జోయ్ పరేఖ్ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఐఐఎం విశాఖపట్నం సహకారం ద్వారా విద్యార్థులకు వారి విద్యా ప్రయాణం ప్రారంభ దశలోనే ప్రపంచ స్థాయి అకడమిక్ వాతావరణాన్ని అందించాలన్న తమ నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఐఎస్ఎఫ్‌బిలో తరగతి గదిలో నేర్చుకునే విద్య వాస్తవ ప్రపంచ అవసరాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించనుందన్నారు.

విశాఖ బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 9 నుంచి 11 వరకూ సెయింట్ ఆంథోనీ ఓల్డ్ తెలుగు ప్రైమరీ స్కూల్‌లో జరిగే విశాఖ బాలోత్సవం మూడో మెగా చిల్డ్రన్స్ ఫెస్టివల్ పోస్టర్‌ను మంగళవారం విఎంఆర్‌డిఎ కమిషనర్ ఎన్.భరత్ తేజ్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. బాలోత్సవం ప్రధాన కార్యదర్శి జిఎస్.రాజేశ్వరరావు, ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షులు పి.లచ్చిరాజు, జివి.రమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ ఈసారి బాలోత్సవాన్ని విశాఖ వ్యాలీ రోటరీతో కలిసి సెయింట్ ఆంథోనీ స్కూల్‌లో నిర్వహిస్తున్నామని, బాలోత్సవం బుక్‌లెట్స్‌ను కార్యకర్తలు 400 స్కూళ్లకు తీసుకెళ్లి అందించారని తెలిపారు. స్కూల్స్ నుంచి ఎంట్రీ ఫారాలు నింపి తిరిగి పంపే ప్రక్రియ ప్రారంభమయ్యిందని, స్పందన చాలా బాగుందని తెలిపారు. గత సంవత్సరం బాలోత్సవంలో 8 వేల మంది పిల్లలు పాల్గొన్నారని, ఈసారి ఇంకా ఎక్కువ స్కూళ్ల నుండి పిల్లలు పాల్గొనే అవకాశం వుందని అన్నారు. ఈ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విఎంఆర్‌డిఎ కమిషనర్ భరత్ తేజ్ తదితరులు

నెల 9న జరిగే ప్రారంభ సభకుగానీ, 11న జరిగే ముగింపు సభకుగానీ ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిందిగా ప్రతినిధివర్గం కమిషనర్‌ను కోరిందని తెలిపారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ స్కూల్ పిల్లలకు అకడమిక్ అండ్ కల్చరల్ ఈవెంట్లలో పోటీలు నిర్వహించడం ఎంతో ముదావహమని, అందుకు విశాఖ బాలోత్సవాన్ని అభినందిస్తున్నానని తెలిపారు. గతంలో తాను రాజమండ్రి బాలోత్సవానికి హాజరయ్యానని గుర్తుచేసుకున్నారు

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, హైవేలో జీబ్రా క్రాసింగ్ వద్ద సోలార్ బ్యాంకర్లు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ సమావేశ మందిరంలో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చితో కలసి రహదారి భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరం విశాఖ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రుల వివరాలను, వారికి ప్రభుత్వం తరుపున అందజేసిన సాయం విషయాలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా గుర్తు తెలియని వాహనాల ద్వారా ప్రమాదానికి గురైన బాధితులకు అందుతున్న పరిహారంపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా అధికారి ఆర్‌సిహెచ్.శ్రీనివాస్ గత సమావేశంలో చర్చించిన అంశాలను, చేపట్టిన పురోగతిని సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో పోలీసు, వైద్యారోగ్య శాఖ అధికారులు, జివిఎంసి అధికారులు పాల్గొన్నారు.

పోషకాహార పంపిణీ ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పాత పోస్ట్ ఆఫీస్ సమీపంలోని కీన్స్ మేరీ హైస్కూల్లో విద్యార్థులకు అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోషకాహార పదార్థాల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషకాహారం అందించడం వల్ల పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్, కూటమి నాయకులు కొల్లి సింహాచలం, ప్రణీత్, తహశీల్దార్ పైడప్ప నాయుడు, ప్రధానోపాధ్యాయులు జోగేంద్ర, స్కూల్ కమిటీ చైర్మన్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల వితరణ

ప్రజాశక్తి-సీలేరు : గూడెం కొత్తవీధి మండలం గుమ్మిరేవుల పంచాయితీ పరమ సింగవరం ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు అనకాపల్లి జిల్లా ఎలమంచిలికి చెందిన ప్రశాంతి రెడీమేడ్ షాపు యజమాని మంగళవారం దుస్తులు అందజేశారు. ఈ ప్రాంతంలో ప్రశాంత్ అనే టీచరు విద్యార్థులకు మంచి దుస్తులు లేకపోవటాన్ని గమనించి, గిరిజన విద్యార్థులకు ఏదో విధంగా సహాయం చేయాలని దృక్పథంతో రెడీమేడ్ షాపు యజమానితో మాట్లాడి బీద విద్యార్థులకు బట్టలు వితరణగా ఇవ్వాలని కోరారు.

విశాఖ ఎయిర్‌పోర్టును కొనసాగించాలి

ప్రొఫెసర్ కెఎస్.చలం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పెరుగుతున్న విశాఖపట్నం నగరానికి ఎయిర్ కనెక్టివిటీ అత్యవసరమని, ప్రస్తుత విశాఖ విమానాశ్రయాన్ని దేశీయ (డొమెస్టిక్) కేంద్రంగా కొనసాగించాలని కోరుతూ ఉత్తరాంధ్ర అధ్యయన వేదిక గౌరవాధ్యక్షులు ఆచార్య కెఎస్.చలం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రికి లేఖ రాశారు. అదేవిధంగా అనకాపల్లిలో కొత్త గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్‌ను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. లేఖలోని అంశాలను మంగళవారం మీడియాకు ఆయన తెలియజేశారు. విశాఖపట్నం అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో నగరం నుండి విమానాల సంఖ్యను తగ్గించడం లేదా విమానాశ్రయాన్ని తరలించడం వల్ల అభివృద్ధి కుంటుపడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత విమానాశ్రయాన్ని విజయనగరం జిల్లాలోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి మార్చాలనే ప్రతిపాదనపై ఆయన అభ్యంతరం తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ విశాఖ నగరం నుండి 40-50 కిలోమీటర్ల దూరంలో ఉందని, ఈ దూరం కారణంగా రవాణా ఖర్చులు, ప్రయాణ సమయాన్ని మధ్య తరగతి పౌరులు భరించడం కష్టమని లేఖలో స్పష్టం చేశారు. విశాఖపట్నం వంటి పెరుగుతున్న అంతర్జాతీయ, ప్రాంతీయ కేంద్రానికి విమానాశ్రయం లేకపోతే అది ఒక పెద్ద అవరోధంగా మారుతుందని తెలిపారు. ఎయిర్ కనెక్టివిటీ మద్దతుతోనే నగరం అభివృద్ధి చెందిందని గుర్తుచేశారు.

జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు నెంబర్లలో మార్పు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం - లింగంపల్లి మధ్య నడిచే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు నెంబర్లను మారుస్తూ రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో విశాఖపట్నం - లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు పాత నెంబర్ 12805కు బదులు కొత్త నెంబర్ 18501తో నడుస్తుంది. అదేవిధంగా లింగంపల్లి - విశాఖపట్నం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు పాత నెంబర్ 12806కు బదులు కొత్త నెంబర్ 18502తో నడుస్తుంది. ఈ నెంబర్ల మార్పు 2026 ఫిబ్రవరి 15 నుంచి అమలులోకి వస్తుందని, రైలు ప్రయాణికులు ఈ మార్పును గమనించాలని రైల్వే శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు. యాప్‌లోనూ ఈ మార్పులు కనిపిస్తాయన్నారు.

విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాలి

జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి- మధురవాడ : వినూత్న బోధనా పద్ధతులను అవలంబించటం ద్వారా ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సూచించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మంగళవారం ఉదయం ఎండాడలోని జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో పలు అంశాలపై ముచ్చటిస్తూ కుశల ప్రశ్నలు వేశారు. వివిధ పాఠ్యాంశాల్లోని అంశాలపై ప్రశ్నలు అడిగారు. పుస్తకాలను, అందులోని చిత్రాలను చూపించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ, వినూత్న రీతిలో ఆసక్తికరించే విధంగా పాఠ్యాంశాలను బోధించాలని, తార్కిక భావజాలం విద్యార్థుల్లో పెంపొందేలా బోధన సాగించాలని సూచించారు. పిల్లలు అడిగే అన్ని ప్రశ్నలకు స్నేహపూర్వక వాతావరణంలో సమాధానం ఇవ్వాలని, అప్పుడే వారిలో బిడియం పోతుందని పేర్కొన్నారు.



విద్యార్థులను పరీక్షిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

అనంతరం పాఠశాలలోని ఇతర వసతులను, మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరును పరిశీలించారు. వివిధ రికార్డులను తనిఖీ చేశారు. అక్కడున్న సమస్యలను, ఇతర అంశాలను ఉపాధ్యాయులను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. ఆయనతో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్‌కుమార్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీకి అనుబంధ సంఘాలు ముఖ్యం



సమావేశంలో మాట్లాడుతున్న మొల్లి అప్పారావు

ప్రజాశక్తి - ఆరిలోవ : పార్టీకి అనుబంధ సంఘాల కమిటీలు చాలా ముఖ్యమని విశాఖ తూర్పు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మొల్లి అప్పారావు పేర్కొన్నారు. జివిఎంసి 13వ వార్డు వైసిపి అధ్యక్షులు సత్యాల వెంకట్ ఆధ్వర్యంలో వార్డు అనుబంధ విభాగాల అధ్యక్షులతో మంగళవారం వార్డు పార్టీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లి అప్పారావు మాట్లాడుతూ, అనుబంధ విభాగాల అధ్యక్షులు 8 మంది సభ్యులతో కూడిన కమిటీని వేసుకోవాలని చెప్పారు. పార్టీ కోసం కష్టపడే వ్యక్తులకు మాత్రమే అవకాశం ఇవ్వాలని, నియమితులైన ప్రతి ఒక్కరికీ కేంద్ర కార్యాలయం నుంచి గుర్తింపు కార్డులు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎస్‌సి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి అల్లంపల్లి రాజబాబు, ఎస్‌సి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడపాటి విక్టర్, తూర్పు నియోజకవర్గం మహిళా అధ్యక్షులు కె.శిరీష, జిల్లా ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పాత్ర, తూర్పు బిసి విభాగం అధ్యక్షుడు బేతా దుర్గారావు, తూర్పు డాక్టర్స్ విభాగం అధ్యక్షుడు రాపేటి సన్యాసినాయుడు, సత్యాల సాగరిక, ప్రసంగి వాసు, బేగం, బంగార్రాజు, కాకర గోవింద, భాస్కర్, సురేష్, రామకృష్ణ, పైడిపినాయుడు, మేరీ,ఈశ్వర్, బాబూరావు, అప్పలనాయుడు, పోలారావు, నాని, మహేష్, చంద్రరావు, ఈశ్వర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులు



నెట్ బాల్ పోటీలకు ఎంపికైన సోహిల్

ప్రజాశక్తి -యంత్రాంగం

నెట్ బాల్ పోటీలకు సోహిల్

భీమునిపట్నం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పశ్చిమ గోదావరి జిల్లా, పాలకోడేరు మండలం, శృంగవృక్షం జెడ్‌పి హైస్కూల్ క్రీడా మైదానంలో 14 ఏళ్ల లోపు బాలబాలికలకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి కె.సోహిల్ బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు సన్ స్కూల్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. సంబంధిత విద్యార్థిని పాఠశాలలో అభినందించారు.

కరాటే పోటీలకు కేథరిన్ విద్యార్థి

భీమునిపట్నం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 14 ఏళ్ల లోపు బాలబాలికలకు తూర్పు గోదావరి జిల్లా, రాజమండ్రిలో నిర్వహించిన కరాటే పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు 3 పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కేథరిన్ విద్యా సంస్థల అధినేత ఆలివర్ రాయి తెలిపారు. 6వ తరగతి విద్యార్థిని గ్రేస్ ద్వారక అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించడమే గాకుండా త్వరలో జరుగనున్న జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. 6వ తరగతి విద్యార్థినులు పూజిత 22వ కేటగిరిలో, 24వ కేటగిరిలో కుజిత, 9వ తరగతి విద్యార్థిని ఎలిఖిత్‌శ్రీ 50వ కేటగిరిలో కరాటే పోటీల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచి ఒక్కో కాంస్య పతకాన్ని గెలుచుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినులను అభినందించారు. స్పోర్ట్స్ ర్యాంకింగ్‌లో జిల్లాలోనే తమ పాఠశాల గతేడాది రెండో స్థానంలో, మండలంలో మొదటి స్థానంలో నిలిచినట్లు తెలిపారు.



గ్రేస్ ద్వారకను అభినందిస్తున్న ఆలివర్ రాయి

రగ్బీ పోటీలకు లక్ష్మీపురం విద్యార్థిని శ్రావ్య

తగరపువలస : ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో మండలంలోని లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని కరుభుక్త శ్రావ్య జాతీయస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దంతంశెట్టి సత్యారావు తెలిపారు. గత నెల 28, 29 తేదీలలో ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరులో రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలలో మంచి ప్రదర్శన కనబరిచిన శ్రావ్యను, వ్యాయామ ఉపాధ్యాయుడు చిల్ల వెంకటరెడ్డి అభినందించారు. అయ్యప్పస్వామి సేవాపీఠం ధర్మకర్త గాడు తాతినాయుడు శ్రావ్యను అభినందిస్తూ భవిష్యత్తులో విద్యార్థినికి ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మొకర శంకరరావు కె.రమణ, వెంకటరమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థి శ్రావ్యను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ పరిధిలో ఉన్న పొట్టి శ్రీరాములు ఉన్నత పాఠశాలలో తెలుగు అసిస్టెంట్, రాయిపాలెం ఉన్నత పాఠశాలలో తెలుగు, హిందీ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఇఒ 1, 2లు ఎం.శివరాణి, ఎ.జయప్రద మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఎంఇఒ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. ఎంపికైన వారు ఈ ఏడాది డిసెంబర్ 8వ తేదీ నుంచి 2026 మే 7వ తేదీ వరకు పనిచేయాల్సి ఉంటుందని, నెలకు రూ.12,500 గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు. దరఖాస్తు నమూనా స్థానిక ఎంఇఒ కార్యాలయంలో అందుబాటులో ఉందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

'బాబు పాలనలో పెన్షన్ల సంఖ్య కుదింపు'

ప్రజాశక్తి -తగరపువలస : రాష్ట్రంలో పెన్షన్ వ్యవస్థపై పెద్ద గందరగోళం కొనసాగుతోందని, కొత్త పెన్షన్లు లేవు సరికదా ఇప్పటికే ఉన్న పెన్షన్లలో దాదాపు 5 లక్షల వరకు తగ్గిపోయాయని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి బింగి హరి కిరణ్ రెడ్డి ఆరోపించారు. ఏడాదిన్నర నుంచి దాదాపు 2.5 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయని తెలిపారు. అర్హత ఉన్నా దరఖాస్తు చేసుకునే అవకాశం లేక మరో 3 లక్షల మందికి పైగా ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. బిసిలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చి మోసం చేశారని విమర్శించారు.



మొక్కలు నాటుతున్న గ్రామీణ వైద్యులు

మొక్కల నాటివేత

ప్రజాశక్తి- ఆనందపురం : ప్రపంచ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ఆనందపురం జోనల్ ఆఫీసు ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ, 'పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, కాలుష్యాన్ని అరికట్టడంతో పాటు భావితరాలకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణం అందించేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు.

నేడు బోనిలో 'రైతన్నా మీకోసం'

ప్రజాశక్తి ఆనందపురం : ఆనందపురం మండలం బోని పంచాయతీలో బుధవారం ఉదయం 10 గంటలకు రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి సిహెచ్.సంధ్య రత్నప్రభ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హాజరుకానున్నారని పేర్కొన్నారు. రైతులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని ఎఒ కోరారు.

నేరాలు ఘోరాలు

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి మండలం లైన్ కొత్తూరు శివారు మల్లవరం వద్ద నవంబర్ 30న ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన షేక్ సుభాన్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు యలమంచిలి రూరల్ ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు. ఆదివారం ఉదయం యలమంచిలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రామకృష్ణ తమ సిబ్బందితో కలిసి మల్లవరం గ్రామం వద్ద విజిబుల్ పోలీసింగ్ చేస్తుండగా ఎలమంచిలి వైపు నుండి రేగుపాలెం హైవే వైపు బైక్‌పై వస్తున్న వ్యక్తి పోలీసులను చూసి తన బైక్‌ను యూటర్న్ తిప్పాడు. ఈ సమయంలో యలమంచిలి వైపు నుండి రేగుపాలెం వైపు స్కూటీపై వెళ్తున్న విశాఖపట్నం, సీతమ్మధారకు చెందిన భార్యాభర్తలను ఢీకొనడం జరిగింది. ఈ ప్రమాదంలో స్కూటీ నడుపుతున్న షేక్ సుభాన్ తలకు బలమైన గాయం కాగా, వెనుకను కూర్చున్న అతను భార్యకు గాయలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి సుభాన్ మృతి చెందాడు. సుభాన్ అల్లుడు మహమ్మద్ కాజా చిస్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఉపేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న హేమలత

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-కొమ్మాది: జివిఎంసి 5వ వార్డులో సుమారు రూ.40 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంగళవారం కార్పొరేటర్ మొల్లి హేమలత భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ, వార్డులోని ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే లక్ష్యంతో ఈ పనులను చేపట్టినట్లు తెలిపారు. పరదేశిపాలెంలో సామాజిక భవనం, రోడ్లు, కాలువలు, మారికవలసలో రోడ్లు, కాలువల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు వివరించారు. వార్డులో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, ఈగల రవికుమార్, ఎఇ తిరుమలరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, స్థానిక నాయకులు ముచ్చి రామనాయుడు, దేవర శివ, కొండపు రాజు, మాన్యాల సురేష్, బోర తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కంప్యూటర్ లిటరసీ డే

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వరల్డ్ కంప్యూటర్ లిటరసీ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీవాణి మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో కంప్యూటర్ జ్ఞానం అందరికీ అవసరమన్నారు. కంప్యూటర్ లిటరసీ ఉన్నవారికి అవకాశాలు మెరుగ్గా ఉంటాయని, డిజిటల్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం చాలా ముఖ్యమని తెలిపారు. కంప్యూటర్ లెక్చరర్ ఆర్.రజని మాట్లాడుతూ, కంప్యూటర్ విద్యా ప్రాముఖ్యతను అందరికీ చేరవేయడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రతి రంగంలో కంప్యూటర్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్‌కు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి -తగరపువలస : భీమునిపట్నం మండలంలోని దివీస్ లేబొరేటరీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో గ్రామీణ మహిళలకు అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్‌కు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ పి.జగదీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామీణ నిరుద్యోగ మహిళలు ఈ ఉచిత శిక్షణకు రావడం అభినందనీయమన్నారు. శిక్షణ పొంది మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. సిఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్ మాట్లాడుతూ, నిరుద్యోగులైన గ్రామీణ మహిళలకు శిక్షణ ఉచితంగా అందిస్తున్నామని, స్థానిక మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్నవరం, చిప్పాడ, నాగమయ్యపాలెం, మూలకుద్దు గ్రామాల నుండి 60 మంది మహిళలు, దివీస్ ఇన్‌ఛార్జి ఎ.శ్రీనివాస్, పి.శేఖర్‌బాబు, బిందు, శిరీష పాల్గొన్నారు.

పూడికల తొలగింపు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి- గాజువాక : దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి సబ్బవరం వెళ్లే రహదారిలో జివిఎంసి 88వ వార్డు పరిధిలో కాలువల్లో ఉన్న పూడికలను జివిఎంసి పారిశుధ్య సిబ్బంది తొలగించారు. కాలువలు పూడుకుపోయి నీరు రహదారిపై ప్రవహిస్తుండటంతో 'రహదారిపైనే మురుగు నీరు' శీర్షికన ప్రజాశక్తిలో నవంబర్ 24వ తేదీన ప్రచురితమైన కథనానికి జివిఎంసి అధికారులు స్పందించారు. మంగళవారం జివిఎంసి ఇంజినీరింగ్ అధికారులు ఆ ప్రాంతానికి వెళ్లి రహదారిని పరిశీలించారు. కాలువల ఏర్పాటుకు ఎస్టిమేషన్ వేశారు. అనంతరం పారిశుధ్య, మలేరియా విభాగాల ఆధ్వర్యాన కాలువలో పేరుకుపోయిన పూడికలను తొలగించారు.



ఉచితంగా ట్యూషన్ చెబుతున్న ఉపాధ్యాయులు మండంగి రమేష్

ఉచితంగా ట్యూషన్

ప్రజాశక్తి- విశాఖపట్నం : మధురవాడ దుర్గానగర్ భరత్ ఎన్క్లేవ్ అపార్ట్మెంట్లో నివాసముంటున్న మండంగి రమేష్ స్థానికంగా ఉన్న పేద విద్యార్థులకు ప్రతి ఆదివారమూ అపార్ట్మెంట్ వద్దే ఉచితంగా ట్యూషన్లు చెబుతున్నారు. విజయనగరం జిల్లా జామి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రమేష్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. మంగళవారం ఆయన్ను కలిసిన ప్రజాశక్తితో మాట్లాడుతూ, పేద విద్యార్థులకు గత రెండు నెలలుగా ప్రతి ఆదివారమూ సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు ఉచిత ట్యూషన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యను నేర్పగలిగితే నేటి బాలలే రేపటి పౌరులు అనే నినాదం నెరవేరుతుందనే భావనతో ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు బోధిస్తున్నాని చెప్పారు. నిరుపేద విద్యార్థులకు తనకు తోచిన ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. చదువు, ఆరోగ్యం, ప్రవర్తన పట్ల అవగాహన సదస్సులు నిర్వహిస్తూ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.



బహుమతులు అందుకుంటున్న విద్యార్థినులు

కంప్యూటర్ జ్ఞానం అవసరం

ప్రజాశక్తి -గాజువాక : విద్యార్థినులకు కంప్యూటర్ జ్ఞానంతో పాటు, డిజిటల్ అక్షరాస్యత అవసరం పెరిగిందని చైతన్య మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ విజయలక్ష్మి అన్నారు. గాజువాక మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ, కంప్యూటర్ అక్షరాస్యతతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించడం, అధునాతన సమస్య పరిష్కారానికి ఏ వన్ టూల్స్ వినియోగంలో నైపుణ్యత పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కామేశ్వరి, కంప్యూటర్ విభాగ అధిపతి మను, అధ్యాపకులు పద్మ, భాగ్యలక్ష్మి, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులకు సెమినార్, పోస్టర్ ప్రజెంటేషన్, పియటి ప్రదర్శించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతి ప్రదానం చేశారు.

ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ కల్పించాలి

ప్రజాశక్తి -గాజువాక : చినగంటాడ ఎస్సి.కాలనీలో నివాసం ఉంటున్న ప్రజల ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించాలని అంబేద్కర్ జగ్జీవన్‌రామ్ యువజన సేవా సంఘం అధ్యక్షులు కొల్లి దేముడు మంగళవారం గాజువాక తహశీల్దార్ బి.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. 30 కుటుంబాలకు గత ప్రభుత్వంలో ఇళ్ల పట్టాలు, స్కీములు, రోడ్లు, మంజూరు చేశారని తెలిపారు. వారికిచ్చిన ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేయలేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పి జిఒ లేదంటూ వాయిదా వేశారని, తక్షణమే రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో మార్డుపూడి పరదేశి, మండే సత్యనారాయణ, కొండబాబు, ఎం.కైలాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే పల్లా సమీక్ష

ప్రజాశక్తి -గాజువాక : శంకుస్థాపన చేసిన ప్రతి పనినీ త్వరగా పూర్తి చేయాలని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు జివిఎంసి గాజువాక జోనల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో జివిఎంసి గాజువాక జోనల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఉన్న అన్ని ప్రధాన రహదారులు, మరమ్మత్తులకు చేసిన శంకుస్థాపన పనులను వెంటనే ప్రారంభించాలని చెప్పారు. రహదారుల విస్తరణలో భూములు కోల్పోయిన వారికి తక్షణమే టిడిఆర్‌లను మంజూరు చేయాలని ఆదేశించారు. కూర్మన్నపాలెం, దువ్వాడ ప్రధాన రహదారి పనులు, బిసి రోడ్డు నుండి పెదగంట్యాడ సర్వీస్ రోడ్డు వరకు, గంగవరం ప్రధాన రహదారుల పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.



జోనల్ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ఏడాది క్రితం వంటిల్లు వద్ద శంకుస్థాపన చేసిన పనులు ఇప్పటికి పూర్తికాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్ శేషాద్రి, ఇఇ రాయల్ బాబు, టౌన్ ప్లానింగ్ ఎసిపి వెంకటరావు, డిఇ నారాయణరావు, ఎఇ శివ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా వేళలు తాత్కాలిక మార్పు

ప్రజాశక్తి-సీతమ్మధార: జివిఎంసి 5వ జోన్ పరిధి 44వ వార్డులోని పలు ప్రాంతాలలో తాగునీటి సరఫరా సమయం తాత్కాలికంగా మార్పుచేసినట్లు నీటి సరఫరా నిర్వహణ విభాగం కార్యనిర్వాహక ఇంజినీరు సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలయ్య శాస్త్రి లే-అవుట్ గ్రీన్ పార్క్ కాలనీలోని 1800 కెఎల్ జిఎల్ఎస్ఆర్ రిజర్వాయర్ స్లాబ్ అత్యవసర మరమత్తుల నిమిత్తం 44వ వార్డులోని ముస్లిం తాటిచెట్లపాలెం ఏరియా, ఆంధ్రజ్యోతి కార్యాలయం పరిసర ప్రాంతాలలో తాగు నీటి సరఫరా సమయం ఉదయం 6 నుండి 6:45 నిమిషాల వరకు ఉన్న సమయాన్ని కొత్తగా సాయంత్రం 4 నుండి 4:45 నిమిషాల వరకు, రామచంద్ర నగర్ ఏరియా సాయిబాబా గుడి పరిసర ప్రాంతాల్లో ఉదయం 6:45 నుండి 7:30 గంటల వరకు ఉన్న సమయాన్ని సాయంత్రం 4:45 నుండి 5:30 గంటల వరకు, ముస్లిం తాటిచెట్లపాలెం ఏరియా ఉర్దూ స్కూల్, పెద్దూరు మసీదు పరిసర ప్రాంతాలలో ఉదయం 7:30 నుండి 8:15 గంటల వరకు ఉన్న సమయాన్ని సాయంత్రం 5:30 నుండి 6:15 గంటల వరకు, అబిద్ నగర్ ఏరియా రంగరాజు కాలనీ, పల్లవి అపార్ట్మెంట్ వెనక రోడ్డు పరిసర ప్రాంతాలలో ఉదయం 8:15 నుండి 9 గంటల వరకు ఉన్న సమయాన్ని సాయంత్రం 6:15 నుండి 7 గంటల వరకు తాగునీటి సరఫరా సమయ వేళలను మార్పుచేసినట్లు పేర్కొన్నారు. మరమ్మత్తు పనులు పూర్తయ్యే వరకు మార్పు చేసిన సమయంలో నీటి సరఫరా జరుగుతుందని, ప్రజలు గమనించి సహకరించాలని కోరారు. పనులు పూర్తయిన వెంటనే పాత సమయాలలోనే సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

న్యూట్రిషన్ బార్ ప్యాకెట్ల పంపిణీ

ప్రజాశక్తి-సీతమ్మధార : అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని జివిఎంసి హైస్కూల్లో విద్యార్థులకు అక్షయ పాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యాన నూతనంగా న్యూట్రిషన్ బార్ ప్యాకెట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొందు సీతారాం మాట్లాడుతూ, విశాఖ జిల్లాలో దాదాపు 321 ప్రభుత్వ పాఠశాలల్లో 49 వేల మంది విద్యార్థులకు వచ్చే ఏడాది మార్చి నెలవరకు ప్రతి మంగళ, గురు, శనివారాల్లో ఉదయం పూట పాఠశాలల ప్రార్థన సమయాల్లో ఈ చిరు ధాన్యాలతో తయారుచేసిన చిక్కి, వేయించిన వేరుశెనగలు, వేయించిన స్నాక్స్‌ను కలగలిపి ప్రోటీన్ బార్ న్యూట్రిషన్ పేరిట అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా పౌష్టికాహారం పూర్తిస్థాయిలో అందుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది ఎక్కువ నెలలు, మరిన్ని రోజుల్లో వీటిని అందించేలా దాతల సహాయ సహకారాలతో అక్షయ



న్యూట్రిషన్ బార్ ప్యాకెట్లు అందుకున్న విద్యార్థులతో అతిథులు

పాత్ర ఫౌండేషన్ సంస్థ కృషిచేయాలని కోరారు. సీతమ్మధార మండల విద్యాశాఖాధికారి రామారావు మాట్లాడుతూ, ఉదయంపూట ఈ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్త హీనతతో పాటు ఎన్నో వ్యాధులను దూరం పెట్టొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధాకుమారి, అక్షయ పాత్ర ఫౌండేషన్ విశాఖ ప్రతినిధి రాజేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గీతంలో ఐఐసి ప్రాంతీయ సమావేశం



ఐఐసి ప్రాంతీయ సమావేశాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-మధురవాడ : కేంద్ర విద్యా మంత్రిత్వశాఖలోని ఇన్నోవేషన్ సెల్, అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఎఐసిటిఇ) ఆధ్వర్యంలో ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసి) ప్రాంతీయ సమావేశాన్ని మంగళవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో విశాఖ జిల్లా కలెక్టర్ ఎమ్ఎన్.హరేంద్రప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. నూతన ఆవిష్కరణలు, స్టార్టప్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. గీతం ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ, యువతలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి గీతంలో వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్ (విడిసి)ను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సిఇఒ డాక్టర్ బివిఆర్.మోహన్‌రెడ్డి, సిఇఒ సుధాకర్ పోటుకూచి, ఆర్‌టిఐహెచ్ విశాఖపట్నం సిఇఒ డాక్టర్ రవిఈశ్వరపు, వాద్వాని ఫౌండేషన్ స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్స్ డైరెక్టర్ దయాకర్ ఎస్.మూర్తి, విద్యామంత్రిత్వ శాఖ ఎఐసిటిఇ చీఫ్ కో-ఆర్డినేటింగ్ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్ బుద్ద, విద్యామంత్రిత్వశాఖ ఇన్నోవేషన్ సెల్ ఎఐసిటిఇ ఇన్నోవేషన్ ఆఫీసర్ సెల్వరాణి సెల్వకుమార్, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా.పి.పప్పు తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఉన్నత విద్యా సంస్థల్లో ఆవిష్కరణలు, స్టార్టప్‌ల సంస్కృతిని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ఐఐసి పనిచేస్తుందని వారు తెలిపారు.

ఈ ప్రాంతీయ సమావేశంలో నూతన ఆవిష్కరణలపై చర్చా వేదికలు, ఇన్నోవేషన్ ప్రదర్శనలు, స్టార్టప్ షోకేస్‌లు, ఆలోచనల సమర్పణలు, శిక్షణ సెషన్లు, యువ ఇన్నోవేటర్లు, సంస్థాగత బృందాలకు మార్గనిర్దేశం చేసే పరిజ్ఞానం పంచుకునే కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇన్నోవేటర్లు, అధ్యాపకులు, ఎకోసిస్టమ్ ఎనేబ్లర్లు, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు స్టూడెంట్ అంబాసిడర్లు, ఐఐసి సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్ ప్రాణాంతకం కాదు : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-సీతమ్మధార : స్క్రబ్ టైఫస్ ప్రాణాంతకం కాదని, దీని గురించి ప్రజలెవరూ భయాందోళన చెందనవసరం లేదని జిల్లా ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. పురుగు కుట్టినప్పుడు కనపడే లక్షణాలు జ్వరం, తలపోటు, కండరాల నొప్పులు, ఆకలి లేకపోవడం, శోషరస కణుపుల వాపు, వినికిడి తగ్గుదల, దగ్గు, శ్వాస ఆడకపోవడం తదితర లక్షణాలు కనపడతాయని పేర్కొన్నారు. డాక్సిసైక్లిన్, ఎజిత్రోమైసిన్ వంటి మందులు ద్వారా నివారించవచ్చు అని తెలిపారు. నివారణ కోసం ఇంట్లో ఎలుకలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ వ్యాధి విశాఖపట్నం జిల్లాలో 2023లో 12 పాజిటివ్ కేసులు, 2024లో 11 పాజిటివ్ కేసులు, 2025లో 11 పాజిటివ్ కేసులు నమోదైనా, ఒక్క మరణం కూడా సంభవించలేదని తెలిపారు. నల్లటి కురుపు, లింప్ నోడ్స్ వాయుట, జ్వరం వస్తే సమీప ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్యుని సంప్రదించి తగు చికిత్స పొందాలని సూచించారు.

సమయపాలన పాటించని మద్యం షాపులపై చర్యలకు వినతి

ప్రజాశక్తి -గాజువాక : సమయపాలన పాటించని మద్యం షాపులపై చర్యలు తీసుకోవాలని గాజువాక ఎక్సైజ్ ప్రొహిబిషన్ సిఐ సి.హెచ్.నాగశ్రీనివాస్‌కు ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య నాయకులు కె.వనజాక్షి, అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కె.అచ్యుతరావు మంగళవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, వీధికొక మద్యం షాపు తెరిచేలా రాష్ట్ర ప్రభుత్వం లైసెన్సులు కేటాయించిందని, బార్లు, మద్యం షాపుల్లో సమయ పాలన లేకుండా తెల్లవారు రాత్రి 12 గంటల వరకు నడిపిస్తున్నారని వివరించారు. బెల్ట్ షాపుల్లో విచ్చలవిడిగా అమ్మకాలు చేస్తున్నారని తెలిపారు. మద్యం షాపుల దగ్గర మందుబాబులు రోడ్లపైకి వచ్చి అటువైపు వెళ్లే పాదచారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. కల్తీ మద్యాన్ని అరికట్టాలని, బెల్ట్ షాపులను తొలగించాలని, మద్యాన్ని ఎంఆర్‌పి ధరలకే అమ్మేలా, సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో పి.పద్మ, జి.ఓంకార్ ఉన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో సిల్వర్ మెడల్

ప్రజాశక్తి-సీతమ్మధార : రాజస్థాన్ రాష్ట్రం బికనీర్ పట్టణంలోని పూర్ణిమ యూనివర్సిటీలో జరిగిన ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ పోటీలలో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలకు చెందిన బిఎ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎం.తరుణ్ 88 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని అభినందించారు.

దుకాణాలకు 9న బహిరంగ వేలం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 3వ జోన్ (ఆశీలు మెట్ట) పరిధిలో ఖాళీగా ఉన్న షాపులు, కమ్యూనిటీ హాళ్లకు ఈ నెల 9వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ తెలిపారు. జోన్ పరిధిలోని ఎంవిపి కాలనీ వాణిజ్య సముదాయములో షాప్ నెంబర్లు 10, 11, 12, 13, 14, 15, 16కు, డైమండ్ పార్క్ వాణిజ్య సముదాయములో షాప్ నెంబర్లు 8, 9లకు, జగ్గారావు బ్రిడ్జి వాణిజ్య సముదాయములో షాప్ నెంబర్ 6, బిటిఆర్ కాలనీ, రెల్లివీధిలో కమ్యూనిటీ హాళ్లకు మూడేళ్ల కాలానికి గుత్తకు ఇచ్చుటకు ఆశీలుమెట్టలోని జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల పాటదారులు పూర్తి వివరాలకు జోనల్ కమిషనర్ కార్యాలయం పని వేళల్లో పర్యవేక్షకులను సంప్రదించాలని సూచించారు.

సిఐటియు జాతీయ మహాసభ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆటో కార్మికులు

ప్రజాశక్తి-పరవాడ : విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు జరుగు సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) అఖిలభారత 18వ మహాసభల వాల్ పోస్టర్లను మంగళవారం పరవాడ మండలం వాడచీపురుపల్లి ఆటో స్టాండ్‌లో ఆటో రిక్షా కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అలంభిస్తున్న ఆటో, రవాణా రంగ కార్మికుల, ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ మహాసభల్లో పలు తీర్మానాలు చేయడం, భవిష్యత్తు పోరాటాలకు రూపకల్పన జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభలు జయప్రదానికై అందరూ తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వాడు చీపురుపల్లి ఆటో స్టాండ్ నాయకులు పాల్గొన్నారు.

చోడవరం : సిఐటియు జాతీయ మహాసభల వాల్ పోస్టర్‌ను ఆశా వర్కర్స్ చోడవరంలో మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎస్వి నాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహాసభకు దేశవ్యాప్తగా సుమారు 2000 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు కే.వరలక్ష్మి, బి.రామలక్ష్మి, సంతోషి, లక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆశా వర్కర్లు

మునగపాక : సిఐటియు అఖిలభారత 18వ మహాసభల వాల్ పోస్టర్‌ను మంగళవారం స్థానిక పిహెచ్‌సి వద్ద ఆశా కార్యకర్తలు, సిఐటియు నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగ, కార్మికుల సమస్యలపై సమరశీల పోరాటాల నిర్వహిస్తున్న సిఐటియు అఖిలభారత మహాసభలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంలో మొట్టమొదటిసారి జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ ఎస్ బ్రహ్మాజీ, ఆశా యూనియన్ జిల్లా కోశాధికారి పార్వతి, కుమారి, లక్ష్మి, పద్మ, ఉమా, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : సిఐటియు అఖిలభారత మహాసభల పోస్టర్‌ను పోర్టు హాస్పిటల్ వద్ద సిఐటియు నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. మహాసభల సందర్భంగా జనవరి 4వ తేదీన లక్ష మందితో ఆర్‌కె.బీచ్‌లో నిర్వహించే ప్రదర్శన, బహిరంగ సభలో ప్రజలు పాల్గొని జయప్రదంచేయాలని కోరారు. దీనికి ముందు డిసెంబర్ 27 నుంచి జనవరి 2వ తేదీ వరకు శ్రామిక ఉత్సవ్ పేరుతో సాంస్కృతిక సంబరాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ మహాసభల జయప్రదం కోసం కార్మికులు, ప్రజలు, శ్రేయోభిలాషులు పూర్తి సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ప్రకాశరావు, స్వతంత్రకుమార్, సత్యనారాయణ, మాధవి, లీలా, రాజు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు



కోటేశ్వరరావుకు విరాళం అందిస్తున్న ముఠా కళాసీలు

ముఠా కళాసీల విరాళం

అచ్యుతాపురం : సిఐటియు అఖిల భారత మహాసభలు జయప్రదానికై స్థానిక ఎస్ఇజెడ్‌లోని గురుజపాలెం ముఠా కళాసీ జట్టు రూ.10వేలు విరాళాన్ని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఆర్.రాముకు మంగళవారం అందజేశారు. ఈసందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై సిఐటియు నిరంతరం రాజీలేని పోరాటం చేస్తుందని చెప్పారు. లేబర్ కోడ్స్ రద్దు, కార్మిక హక్కులకై, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై పోరాటానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాసీ నాయకులు పైడిరాజు, సత్యం, రాము, పెద్ద సంఖ్యలో కళాసీలు పాల్గొన్నారు.

తడిసిన వరి పంట

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : దిత్వా తుఫాన్ కారణంగా కురిసిన వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట తడిచిపోయింది. దిబ్బిడి, బుచ్చయ్యపేట తదితర గ్రామాల రైతులు వరి పంటను కోశారు. అయితే రెండు రోజులుగా చిరు జల్లులు కురుస్తుండడంతో వరి పంట తడిసిపోయింది. దిబ్బిడి గ్రామానికి చెందిన సియ్యాద్రి వెంకటరమణ, తాటికొండ సోమునాయుడు తదితరులకు చెందిన పంట తడిసిపోవడంతో కొంత పంటను ధాన్యం నూర్పిడి యంత్రంతో నూర్చారు. మరికొంత పంట పొలాల్లో ఉండి పోవడంతో పంటను ఆరబెడుతున్నారు. మంగళవారం ఉదయం నుండి వాతావరణం చల్లగా ఉండడంతో పాటు చలిగాలులు వీసాయి.



తడిసిన పంటను ఆరేస్తున్న రైతు

డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ల దరఖాస్తులకు గడువు పెంపు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజనలో భాగంగా జిల్లాలో డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేయడానికి ఆసక్తి ఉన్న సంస్థలు డిసెంబర్ 15వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. 10 లక్షల జనాభాకు ఒక డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ చొప్పున మంజూరు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు జిల్లా రవాణా శాఖాధికారి మనోహర్ వివరించారు. ఆసక్తి గల సంస్థలు డీపీఆర్ నకలు, సంబంధిత అటాచ్మెంట్లతో కలిసి దరఖాస్తులను జిల్లా రవాణాధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. దరఖాస్తు చేసే సంస్థ ఎన్జీఓ, ట్రస్ట్, కోఆపరేటివ్ సొసైటీ లేదా తయారీదారుల ఫర్మ్ అయి ఉండాలని, ఎన్జీఓ అయితే దర్పన్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. సంస్థకు సొంతంగా లేదా కనీసం పది సంవత్సరాల లీజుతో రెండు ఎకరాల స్థలం, సిమ్యులేటర్, ట్రైనింగ్ వాహనాలు, వర్క్‌షాప్, క్లాస్ రూమ్స్, ఇంటర్నెట్ వంటి సదుపాయాలు సిద్ధంగా ఉండాలన్నారు. సమర్పించిన అన్ని దరఖాస్తులను జిల్లా కలెక్టర్ ఆమోదం కోసం పంపబడతాయని అధికారులు తెలిపారు. మరిన్ని వివరాల కోసం డీటీఓ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

అమరపురి బాబా జయంతి వేడుకలకు ఆహ్వానం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని కోమల్లపూడి దరి అమరపురి జ్యోతిర్మయి బాబా శత జయంతి వేడుకలకు మాజీ మంత్రి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును నిర్వాహకులు మంగళవారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా శతజయంతి ఉత్సవాల పోస్టర్ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మాజీ జడ్పీటిసి గోకివాడ కోటేశ్వరరావు, ఉత్సవ నిర్వాహకులు వెంకయ్య చౌదరి, ఎంవివి సత్యనారాయణ, డొంక్కిన అప్పలనాయుడు, శరకాన బాబురావు, వేపాడ మధు పాల్గొన్నారు.



పతకాలు చూపుతున్న విద్యార్థులు

కరాటే పోటీల్లో యలమంచిలి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-యలమంచిలిటౌన్ : అగనంపూడి శీల్డ్ ఫోర్స్ కరాటీ అకాడమీ ఆధ్వర్యాన నిర్వహించిన అంతర్ రాష్ట్ర కరాటీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో యలమంచిలి విద్యార్థులు ప్రతిభ చూపారు. నక్కా వెంకటరమణ, కసింకోట శ్రీను ఆధ్వర్యంలో పిఎస్ఆర్ మార్షల్ ఆర్ట్స్ బృందంతో ఈ పోటీలో పాల్గొనడం జరిగింది. ఈ పోటీల్లో 3 బంగారు, 8 వెండి, 20 కాంస్య పతకాలు సాధించారు. 10 ఏళ్ల కాటా విభాగంలో పి.కుషాలిని, 9 సంవత్సరాల ఫైటింగ్ విభాగంలో కె.హేతిశ్రీ చంద్రిక, 13 సంవత్సరాల విభాగంలో ఎస్‌కె ఆఫ్రిన్ భాను బంగార పతకాలు సాధించారు.

డైట్‌లో ప్రపంచ కంప్యూటర్ సాక్షరత దినోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ కంప్యూటర్ సాక్షరత దినోత్సవం సందర్భంగా సీఎస్‌ఈ డిపార్ట్మెంట్ డే' ఘనంగా రెండు రోజులు జరుగుతాయని సీఎస్‌ఈ విభాగాధిపతి కె.సుజాతా తెలిపారు. మొదటి రోజు మంగళవారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ తిరుమలరావు బెనాల, అసిస్టెంట్ ప్రొఫెసర్, జేఎన్టీయూ హాజరయ్యారు. భవిష్యత్ ప్రపంచంలో కంప్యూటింగ్ పాత్ర మరింత కీలకంగా మారుతోందని తెలిపారు. చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ "కంప్యూటర్ సాక్షరత నేటి ప్రపంచంలో ప్రతి విద్యార్థికి అత్యవసరమని చెప్పారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వైకుంఠ రావు "సీఎస్‌ఈ విభాగం ఎప్పటికప్పుడు కొత్త కార్యక్రమాలను ఏర్పాటు చేసి విద్యార్థుల్లో నైపుణ్య వికాసాన్ని పెంచుతోందని చెప్పారు. కార్యక్రమంలో మూడవ సంవత్సరం విద్యార్థులు, కోఆర్డినేటర్లు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

కార్పొరేట్ బ్యాంకులకు ధీటుగా అభివృద్ధి చేస్తాం



రుణాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కొణతాల తదితరులు

ప్రజాశక్తి-కశింకోట : వ్యవసాయ సహకార బ్యాంకులు సాంకేతికతను అందిపుచ్చుకొని రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. కశింకోట సహకార బ్యాంకు పాలకవర్గ ప్రమాణ స్వీకారం మంగళవారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. సహకార బ్యాంకు అధ్యక్షులుగా సిదిరెడ్డి శ్రీను, డైరక్టర్లుగా శిష్టి అప్పారావు, గండిబోయన కాశీరావు ప్రమాణ స్వీకారం చేశారు. రైతులకు రూ.30 లక్షల రుణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకులను అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పరేషన్ చైర్మన్ బత్తల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, డీసీఎంస్ చైర్మన్ కోట్ని బాలాజీ, కూటమి నాయకులు ద్వారపరెడ్డి పరమేశ్వరరావు, గొంతిన శ్రీనివాసరావు, వేగి గోపికృష్ణ, పెంటకోట రాము, కాయలు మురళి, కర్రి సత్యనారాయణ, కలగ సోమేశ్వరరావు, పెదపాటి కళ్యాణి పాల్గొన్నారు.

పశువైద్యశాలను సందర్శించిన వైద్యాధికారులు

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని తోటాడ వెటర్నరీ హాస్పిటల్‌ను జిల్లా పశు వైద్యాధికారులు మంగళవారం సందర్శించారు. హాస్పిటల్‌లో పశు వైద్యులు లేని కారణంగా పశువులు వ్యాధులు బారిన పడుతున్న నేపథ్యంలో సోమవారం గ్రామానికి చెందిన కోరుబిల్లి చంద్రశేఖర్, కోరువిల్లి వెంకట్, బొడ్డేడ కొండయ్య తదితర పాడి రైతులు స్పందనలో ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు హాస్పిటల్‌ను సందర్శించి పాడి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శాశ్వతంగా హాస్పిటల్లో వైద్యాధికారిణి నియమిస్తామని జిల్లా హెచ్‌ఓ రామ్మోహన్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏడీ గణేష్, నాగులపల్లి వెటర్నరీ డాక్టర్ మౌనిక, వెటర్నరీ అసిస్టెంట్ రమేష్, సిపిఎం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, మల్ల బాపూజీ, ఆడారి జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సమస్యలు తెలియజేస్తున్న రైతులు

ఆసుపత్రిలో ప్రసవాలు పెంచాలి

ప్రజాశక్తి-కశింకోట : ఆసుపత్రిలో ప్రసవాలు పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హైమావతి అన్నారు. ఆశా డే సందర్భంగా తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిసెంబర్ 21న జరగనున్న పల్స్ పోలియో, ఎన్‌సిడి 4.0 కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎస్.సుమ, ఏంపిహెచ్ఇఓ విఎస్.సుబ్బారావు, ఆసుపత్రి సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు బజారు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లిలో రైతు బజారు ఏర్పాటు చేయాలని నెహ్రూ చౌక్ సెంటర్లో ఆమ్ ఆద్మీ పార్టీ చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం నాటికి నాలుగో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కొణతాల హరినాథ్ బాబు మాట్లాడుతూ రైతు అహర్నిశలు కష్టపడి పండించిన పంటను తగిన ధరకు అమ్ముకొనేందుకు అవకాశం లేకపోవడంతో దళారులు అడిగిన రేటుకే తన కష్టాన్ని అమ్ముకొని కన్నీళ్లతో వెన్ను తిరుగుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగం పట్ల, వ్యవసాయ రంగం పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ప్రజాప్రతినిధులు వెంటనే అనకాపల్లిలో రైతు బజారు, రైతు బజారు కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం చేపట్టాలని కోరారు. దీక్ష శిబిరంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బుద్ధ కిషోర్, ఐవైసీ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ బోయిన బాలమురళీకృష్ణ, బీఎస్పీ నాయకులు సూదికొండ మాణిక్యాలరావు, బి.రమణబాబు, విజయ శంకర్ పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేసిన రాంకీ, నాగజగదీష్ తదితరులు

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తోందని జనసేన నియోజకవర్గం ఇన్చార్జ్ భీమరశెట్టి రాంకీ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీష్ పేర్కొన్నారు. జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం అనకాపల్లి నియోజకవర్గం, అనకాపల్లి పట్టణం 80, 81, 82, 83 వార్డులకు చెందిన ఆరుగురికి, అనకాపల్లి మండలం నుంచి ఆరుగురికి మొత్తం 12 మంది లబ్ధిదారులకు రూ.3,78,820 సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు తుది గడువు 6

ప్రజాశక్తి-అనకాపల్లి : ఏపి సార్వత్రిక విద్యా పీఠం (ఏపీ ఓపెన్ స్కూల్) ద్వారా నేరుగా 10వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో చేరడానికి డిసెంబర్ 6 వరకు తత్కాల్ ద్వారా మరో అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు తెలిపారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆసక్తి ఉన్న అభ్యర్థులు జిల్లాలో ఉన్న అధ్యయన కేంద్రాల ద్వారా 6వ తేదీ లోగా నమోదు కావాలన్నారు. ఇప్పుడున్న ఫీజులతో పాటు అదనంగా 600 రూపాయలను చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి సమాచారానికి ఓపెన్ స్కూల్స్ జిల్లా ఇంచార్జ్ పెనుమత్స కృష్ణంరాజు, ఫోన్ నెంబర్ : 8008902915ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో పొన్నాడ అప్పారావు, పరీక్షల విభాగం సహాయ సంచాలకులు ఏ.శ్రీధర్ రెడ్డి, కార్యాలయ పర్యవేక్షకులు రామలింగేశ్వరరావు, పార్వతి, సిసి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మాదక ద్రవ్యాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, యువకుల వ్యసనాలకు దూరంగా ఉండాలని బుచ్చయ్యపేట ఎస్సై ఏ.శ్రీనివాసరావు అన్నారు. మండలంలో గల పిపి అగ్రహారం గ్రామంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో అనేక రకాలైన సైబర్ మోసాలు జరుగుతున్నాయని వాటిపట్ల అప్రమత్తంగా సూచించారు.

తెలుగు మహిళ అధ్యక్షులుగా పుష్ప

ప్రజాశక్తి-దేవరాపల్లి : తెలుగు మహిళ మండల అధ్యక్షురాలుగా కర్రి పుష్ప దేముళ్ళు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఆమెకు ఎమ్మెల్యే అభినందనలు తెలియజేశారు. తనకు పదవి రావడానికి కారణమైన పార్టీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి దొగ్గ దేముడు నాయుడు, రైవాడ ప్రాజెక్ట్ చైర్మన్ పోతల పాత్రునాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, కర్రి సింహాద్రి నాయుడు, చిటిమిరెడ్డి సూర్యనారాయణ, శరకాన సూర్యనారాయణకు కృతజ్ఞతలు తెలియజేశారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడి

ప్రజాశక్తి-అనకాపల్లి : రైతులు పంటలు వేసే ముందు భూసార పరీక్ష చేసుకొని అదనగుణంగా యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక ఉత్పత్తి సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి ఆశాదేవి స్పష్టం చేశారు. అనకాపల్లి మండలం తగరంపూడి గ్రామంలో మంగళవారం భూసార పరీక్షపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్ష చేయించుకోవడం వలన భూమిలో ఉన్న పోషకాల విలువలు తెలుస్తాయని తెలిపారు. భూసార పరీక్ష ఆధారంగా ఎరువులు సమపాళ్లలో వేసుకోవచ్చని చెప్పారు. ప్రస్తుత పంట కోతలు పూర్తయిన వెంటనే భూసార పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రంగాచారి, గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యానవన శాఖ అసిస్టెంట్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కశింకోట : రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు శ్రీధర్ అన్నారు. మండలంలోని సోమవరం గ్రామంలో భూ సార పరీక్షలపై మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ పరీక్ష ద్వారా భూమి స్థితి గతి తెలుస్తుందని తెలిపారు. వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు సుబ్రహ్మణ్యం, సర్పంచ్ గొంతిన నాగరత్నం, మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న, ఏఇఓ పిరోజ్ ఖాన్ పాల్గొన్నారు.

విద్యార్థుల సంరక్షణకు అధిక ప్రాధాన్యత

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి : వసతి గృహాల్లో విద్యార్థుల రక్షణ, సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరం నుండి గిరిజన, సాంఘిక సంక్షేమ, బిసి సంక్షేమ, కెజిబివి, విద్యాశాఖ అధికారులు, వసతిగృహాల సంక్షేమ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో వసతిగృహాలలో విద్యార్థుల హాజరు, పరీక్షల ముందస్తు ప్రణాళిక, మౌళిక సదుపాయాలు, విద్యాప్రమాణాల మెరుగు పరచుటకు తీసుకోవలసిన చర్యలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పదవతరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని, పబ్లిక్ పరీక్షలు ముగిసేవరకు విద్యార్థులు అందరూ వసతిగృహాలలోనే ఉండాలని, పరీక్షలకు సన్నద్ధంకావాలని ఆదేశించారు. బాలికల హాస్టలులోనికి సిబ్బంది తప్ప ఇతరులకు ప్రవేశం అనుమతించకూడదన్నారు. విద్యార్థులకు రక్షితమంచినీరు, నాణ్యమైన భోజనం, నిరంతర వైద్యపరీక్షలు అందించాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సబ్జెక్టుల వారీగా ప్రత్యేక శిక్షణ అందించాలన్నారు. మోడల్ పేపర్లతో పరీక్షలు నిర్వహించాలని సూచించారు. వసతిగృహాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వర్షపునీరు, మురుగునీరు నిల్వలేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి కె.శ్రీదేవి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి జి.మంగవేణి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి బి.రామనాథం, ఎస్-ఎస్ ఎపిసి పి.అప్పారావు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి వినోద్ బాబు పాల్గొన్నారు.

హాస్టళ్లు, అంగన్వాడీ కేంద్రాల్లో మరుగు దొడ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

అనకాపల్లి : జిల్లాలో అన్ని సాంఘిక, వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాల్లో మరుగు దొడ్ల నిర్మాణం వేగవంతం చెయ్యాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ జిల్లా గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం కార్యనిర్వాహక ఇంజనీర్ అనిల్ కుమార్‌కు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జల జీవన్ మిషన్ పనులను సక్రమంగా అమలు చేయాలని, క్రమం తప్పకుండ తాగునీటి పరీక్షలు, ట్యాంకుల శుభ్రత, క్లోరినేషన్ తప్పనిసరిగా జరగాలన్నారు. ఈ సమావేశంలో డీఈఎ. సావిత్రి, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని మండలాల డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

నిబంధనల ప్రకారం పోస్టులను భర్తీ చేయాలి

సిపిఎం, సిఐటియు నేతల డిమాండ్

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఎపిఇపిడిఎల్‌లో ఔట్సోర్సింగ్ ఉద్యోగాలను రోస్టర్ పద్ధతిలో ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా భర్తీ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.వి.శ్రీనివాసరావు, ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు వెంకన్న ప్రకటనల విడుదల చేయగా, శ్రీనివాసరావు, శంకరరావు అనకాపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. నర్సీపట్నం డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న, కొత్తగా 33/11 కెవి సబ్ స్టేషన్లలో ఖాళీలను భర్తీకి ఎటువంటి అవకతవకలకు అవకాశం లేకుండా ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులు రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించి భర్తీ చేయాలని కోరారు. ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యేలు, అధికార కూటమి పార్టీల నాయకులు ఉద్యోగాలను అమ్మకాలకు పెట్టారని, దీని వల్ల దళితులు, గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రూపొందించిన నిబంధనల ప్రకారం పత్రికల ద్వారా నోటిఫికేషన్ ఇచ్చి దరఖాస్తులు స్వీకరణ, ఖాళీలు వివరాలు ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతర రిజర్వేషన్లు ఎంపిక, రోస్టర్ విధానం అమలు, మెరిట్ లిస్ట్ ఆధారంగా అభ్యర్థులు ఎంపిక పారదర్శకంగా జరిగే విధంగా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎటువంటి అవతవకలు జరగకుండా ఎంపికైన అభ్యర్థులకు టెండర్ స్పెసిఫికేషన్స్ ప్రకారం వేతనాలు అమలు, ఇతర సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు.



సమావేశంలో పాల్గొన్న శంకరరావు, శ్రీనివాసరావు



తాళ్లపాలెం సంతలో కూరగాయలు అమ్ముతున్న దృశ్యం

పెరిగిన కూరగాయలు, గుడ్లు ధరలు

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలం తాళ్ళపాలెం వారపు సంతలో కూరగాయలు ధరలు పెరగడంతో సామాన్యులు కొనుగోలు చేయడానికి ఇబ్బంది పడ్డారు. కేజీ వంకాయ, బీరకాయ, చిక్కుడి, టమాటాలు సుమారు రూ.60 కాగా, బంగాలదుంపలు, ఉల్లిపాయ కేజీ రూ.25, పచ్చిమిర్చి కేజీ రూ.80 అమ్మకాలు సాగింది. అలాగే ఒక కోడి గుడ్డు రూ.6.50కు విక్రయించారు. రేట్లు పెరగడంతో చేసేది లేక వున్నదానితో సరిపెట్టుకొని వెనుదిరిగారు.

నూతన కార్యవర్గం చిత్తశుద్ధితో పని చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో నూతనంగా ఎన్నికైన రెడ్‌క్రాస్ కార్యవర్గ సభ్యులు చిత్తశుద్ధితో పనిచేసి, సేవలను పూర్తి స్థాయిలో ప్రజలకు అందించాలని అనకాపల్లి జిల్లా రెడ్ క్రాస్ అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. జిల్లా రెడ్ క్రాస్ నూతన కమిటీ చైర్మన్‌గా జి.శేషుకుమార్, వైస్-చైర్మన్‌గా పప్పుల సురేష్, కోశాధికారి పి.కృష్ణంరాజు, సభ్యులు గొరిపతి, పి. రాజేశ్వర్ ప్రసాద్, కె.వి.ఎస్. ప్రకాశ రావుతో పాటు 11 మంది సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. కలెక్టరేట్ ఛాంబర్ నందు నూతనంగా ఎన్నికైన కార్యవర్గం అనకాపల్లి జిల్లా బ్రాంచ్ వారిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగినది. జిల్లా కలెక్టర్ నూతన కమిటీ సభ్యులను అభినందించారు.

తామరబ్బ యుపి స్కూల్‌కు ఉపాధ్యాయులను నియమించాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని తామరబ్బ యుపి స్కూల్‌కు అదనంగా ఉపాధ్యాయులను నియమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి.వెంకన్న విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం దేవరాపల్లి వచ్చిన డిఇఓ అప్పారావు నాయుడును వెంకన్న కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ ఈ యుపి స్కూల్ సమస్యను పిజిఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు కూడా తెలియజేశామని చెప్పారు. 52 మంది విద్యార్థులు ఉన్నారని, అందరూ ఆదివాసీ గిరిజన తెగలకు చెందిన వారేనని పేర్కొన్నారు. ఇంగ్లీషు, లెక్కలకు మాత్రమే ఉపాధ్యాయులు ఉన్నారని, తెలుగు హిందీ, సోషల్, సైన్స్ సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేరని తెలిపారు. ఇద్దరు టీచర్లే 18 క్లాసులు చెప్పాల్సి వస్తోందని, దీని వల్ల గిరిజన విద్యార్థులకు పూర్తిస్థాయిలో విద్య అందడం లేదని పేర్కొన్నారు. గిరిజన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. దీనికి డిఇఓ సానుకూలంగా స్పందించారు.



డిఇఒకు సమస్యను తెలియజేస్తున్న సిపిఎం నేత వెంకన్న

కల్వర్టు నిర్మాణం పూర్తి చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : జీవిఎంసీ 82 వార్డు విజయరామరాజుపేటలో అసంపూర్తిగా ఉన్న కల్వర్టు నిర్మాణాన్ని సత్వరమే పూర్తి చేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు బొట్ట చిన్ని యాదవ్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఏ కారణంతో పనులను ఆపివేశారో జీవీఎంసీ అధికారులు స్థానిక ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు బొట్టా ఆదినారాయణ, ముగడా అప్పారావు పాల్గొన్నారు.

యలమంచిలిని అనకాపల్లి డివిజన్‌లోనే కొనసాగించాలి

ప్రజాశక్తి-మునగపాక : ఎలమంచిలి నియోజకవర్గాన్ని అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌లోనే కొనసాగించాలని వైసిపి అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ డిమాండ్ చేశారు. మునగపాకలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నక్కపల్లి రెవిన్యూ డివిజన్‌గా ఏర్పడటం వలన తమకు ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. నియోజకవర్గంలోని రాంబిల్లి, అచ్యుతాపురం, మునగపాక మండలాల ప్రజలు తమ అవసరార్థం 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న నక్కపల్లికి పయనించటం వ్యయప్రయాసలతో కూడుకున్న పని అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చియ్య నాయుడు, సర్పంచ్ దిమ్మల అప్పారావు, మద్దాల వీరు నాయుడు, దాసరి అప్పారావు, ఆడారి కాశి బాబు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన నిరాహార దీక్ష

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి పట్టణంలోని పెద్దపల్లి గ్రామంలో చెరువు భూమిని నిషేధిత జాబితాలో చేర్చి, ఆక్రమణదారుల చెర నుంచి కాపాడాలన్న డిమాండ్ చేస్తూ మంత్రిపాలెం, గొల్లలపాలెం గ్రామానికి చెందిన యువకులు యలమంచిలి పాత రహదారిపై చేపట్టిన నిరాహార దీక్షలు మంగళవారం రెండవరోజు కూడా కొనసాగాయి. మూడు గ్రామాలు నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు వచ్చి యువకులకు సంఘీభావం తెలిపి సాయంత్రం వరకు దీక్షలో కూర్చున్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. కార్యక్రమంతో బొద్దపు శివ, పడాల నాగేష్, బొద్దపు రాజా పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఇంటి పన్నుల చెల్లింపు



అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఓ అప్పారావు

ప్రజాశక్తి -మాడుగుల : ఇంటి పన్నులను ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చని ఎంపిడిఓ కొంకి అప్పారావు అన్నారు. మంగళవారం మండలంలోని ఒంటర్లపాలెం గ్రామంలో ఇంటిపన్ను ఆన్‌లైన్‌లో చెల్లింపు విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు.. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ఇంటి పన్నులు పక్కదారి పట్టకుండా ఉండడంతోపాటు చెల్లింపులపై స్పష్టతకు రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ విధానం తీసుకొచ్చిందన్నారు. దీనిద్వారా చెల్లింపులు చాలా సులభంగా జరుగుతాయన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే, ఇంటిపై పన్ను ఎంత ఉందో తెలుసుకుని, దాని ప్రకారంగానే చెల్లించవచ్చున్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, సచివాలయం సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఏజెన్సీని తలపించేలా చలి

ప్రజాశక్తి- అనకాపల్లి రూరల్ : అనకాపల్లి జిల్లాలో వాతావరణం ఏజెన్సీ ప్రాంతాన్ని తలపిస్తుంది. గత రెండు రోజులుగా చలి తీవ్రత బాగా పెరిగింది. తీర ప్రాంతాలను ప్రభావితం చేస్తున్న దిత్వా తుఫాన్ కారణంగా వాతావరణంలో ఆకస్మాత్తుగా మార్పులు చోటుచేసుకున్నాయి. బలమైన గాలులు వీయడంతో అనకాపల్లి జిల్లాలో ఉదయం నుంచే చలి పెరిగింది. ఏజెన్సీ ప్రాంతాలను తలపించేలా చల్లని గాలులు వీచడంతో ప్రజలు ఇంటి బయటకు రావడానికి ఇబ్బంది పడుతున్నారు. ఈ చల్లని గాలులు మరికొన్ని రోజులు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో ఆరోగ్యంపై ప్రభావం పడకుండా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పిల్లలు, వృద్ధులు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది.

బాలికల హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-కె.కోటపాడు : కె.కోటపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కేజీబీవీ టైప్-4 బాలికల వసతి గృహంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల హెచ్ఎం ఎస్.పద్మావతి మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ హాస్టల్లో 9, 10, తరగతులు, ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం చదివేందుకు బాలికల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తిగల బాలికలు దరఖాస్తు చేసుకోడానికి పాఠశాల పనివేళల్లో తనను సంప్రదించాలని కోరారు.

కోర్టు ఆదేశాలతో ఆక్రమణల తొలగింపు



పోలీసు భద్రత నడుమ ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- రావికమతం : మండల కేంద్రం రావికమతం నుండి తోటకూరపాలెం వెళ్లే రహదారిలో తట్టబంద గ్రామం వద్ద ఆర్అండ్‌బి రహదారి ఆక్రమణలను మంగళవారం రెవెన్యూ, పోలీసుల అధికారుల సాయంతో ఆర్అండ్‌బి అధికారులు ప్రొక్లెయినర్‌తో తొలగించారు. రోడ్డు విస్తరణకు అడ్డంగా ఉన్నట్లు గుర్తించిన ఆరుగురు వ్యక్తులు ఆక్రమించిన స్థలాన్ని స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని సమాచారం ఇచ్చినా వారు స్పందించకపోవడంతో తహశీల్దార్ అంబేద్కర్, రావికమతం ఎస్సై రఘు వర్మ సమక్షంలో ఆర్అండ్‌బి నిబంధనల ప్రకారం ఆక్రమణలు తొలగించారు. గతేడాది రహదారి విస్తరణ, ఇరువైపుల డ్రైనేజీల నిర్మాణానికి స్థానిక సర్పంచ్ గోకివాడ రమణ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టగా, తట్టబంద గ్రామం వద్ద మూడు వైపులా పనిని పూర్తి చేశారు. అయితే తట్ట బంద నుంచి తోటకూరపాలెం వెళ్లే రహదారిలో ఐదుగురు దుకాణదారులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో స్థానిక సర్పంచ్ రోడ్డు పనులను నిలిపి వేశారు. తదుపరి వారు హైకోర్టులో పిటిషన్ వేయగా, ఆర్అండ్‌బి అధికారులు నిబంధనల మేరకు రహదారి విస్తరణ, నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు. దీనిపై మరోమారు తహశీల్దార్ అంబేద్కర్, ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్అండ్‌బి అధికారులు జెసిబి సహాయంతో ఆక్రమణ తొలగించారు. అయితే పెద్దాడ సత్తిబాబు అనే వ్యక్తి తన ఇంటి మరుగుదొడ్డి ఆక్రమణ తొలగించేందుకు 15 రోజులు గడువు కోరగా, సంబంధిత వ్యక్తి నుంచి లిఖిత పూర్వకంగా తీసుకున్న తహశీల్దార్ అంబేద్కర్ ఆయనకు అవకాశమిచ్చారు. కోర్టు ఉత్తర్వులతో తొలగింపులు చేపట్టడంతో ప్రశాంతంగా ముగిసింది. కార్యక్రమంలో సర్పంచ్ గోకివాడ రమణ, మాజీ సర్పంచ్ రాజాన నరసింహులు, ఆర్అండ్‌బి జె ఇ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మత్స్యకారులకు రాయితీపై మోటారు ఇంజిన్లు



మోటర్ ఇంజిన్లు అందజేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి -నక్కపల్లి : ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం కింద పాయకరావుపేట నియోజకవర్గంలోని పాయకరావుపేట, నక్కపల్లి మండలాలకు చెందిన 15 మంది మత్స్యకారులకు 40 శాతం రాయితీపై మోటార్ ఇంజిన్లను మంగళవారం అందజేశారు. మంగళవారం నక్కపల్లిలోని హోంమంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు వీటిని లబ్ధిదారులైన మత్స్యకారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాయకరావుపేట నియోజకవర్గ టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, మండల పార్టీ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు,మార్కెట్ యార్డ్ చైర్మన్ దేవర సత్యనారాయణ, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు, నాటక అకాడమీ డైరెక్టర్ వీలియం కేరి, పాయకరావుపేట మండల పార్టీ అధ్యక్షులు చింతలపు ప్రదీప్, టౌన్ ప్రెసిడెంట్ వరహాలు, యస్.రాయవరం మండల పార్టీ అధ్యక్షులు అమలం కంటి అబద్దం, పాయకరావుపేట నియోజక వర్గం టిడిపి మహిళా అధ్యక్షురాలు రమాకుమారి, మత్స్యకార నాయకులు గోసల శ్రీకాంత్, వంకా రమణ, జిల్లా మత్స్యశాఖాధికారి విజయ, మండల మత్స్యశాఖ అధికారి శృతి, పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

యువజన మందిరానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి- మునగపాక : స్థానిక గ్రామీణ యువజన మందిరానికి వైకాపా అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ మంగళవారం రూ.1 లక్ష చెక్కును శాశ్వత నిధి నిమిత్తం కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో యువజన మందిరం అధ్యక్షులు ఆడారి శ్రీకాంత్, కార్యదర్శి సూర్యచంద్ర రామారావు, కోశాధికారి లక్ష్మణరావు, పూర్వపు అధ్యక్షులు ఆడారి గంగ మహేష్, జడ్పిటిసి స్వామి సత్యనారాయణ, ఆడారి గణపతి అచ్చియ్య నాయుడు, రమణ బాబు, మల్ల రామజగన్నాథం పాల్గొన్నారు.

'విశ్వకర్మ' లబ్ధిదారులకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి-చోడవరం : ఎంఎస్ఎంఈ, డెవలప్‌మెంట్, ఫెసిలిటేషన్ ఆఫీస్ అనకాపల్లి జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీఎం విశ్వకర్మ పథకం లబ్ధిదారులకు ఒకరోజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధి మెరుగుదల కోసం విశ్వకర్మ పథకాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పికెపి.ప్రసాద్, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, గోవింద, జగదీష్, సిహెచ్.శివశంకర్, డిఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉద్యమ రిజిస్ట్రేషన్‌పై వర్క్‌షాప్

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉచిత ఉద్యమ రిజిస్ట్రేషన్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి పికెపి.ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యమ రిజిస్ట్రేషన్ చేయించుకోనేవారు పాన్ కార్డ్, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా సంఖ్య, ఓటిపి కోసం ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నెంబరు వివరాలతో హాజరుకావాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్‌కు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని వివిధ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల కొరకు ఈనెల ఆరవ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి-2 బుద్ద కాశీ విశ్వేశ్వరరావు మంగళవారం తెలిపారు. అర్హులైన వారు మండల విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

కృష్ణదేవిపేట ఎస్ఐకి అభినందన



ఎస్ఐతో కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలో కృష్ణదేవిపేట ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన రుషికేశ్వరరావును మంగళవారం టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామాల్లో శాంతిభద్రతలు పరిరక్షించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని నాయకులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ, లింగందొర పాలెం మాజీ సర్పంచ్ గెడ్డం సత్యనారాయణ, టిడిపి మండల కమిటీ నాయకులు దేవాడ శేషు, మాకిరెడ్డి చెన్నారెడ్డి పాల్గొన్నారు.

వైసిపి సంతకాల సేకరణ




భరత్‌కు సంతకాలు సేకరణ పుస్తకాలను అందజేస్తున్న నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీలు ప్రయివేటీకరణ చెయ్యాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జీవిఎంసి 81వ వార్డులో రాష్ట్ర గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ పూర్తి చేశారు. ఈ మేరకు మంగళవారం పార్టీ కార్యాలయంలో సంతకాల సేకరణ పుస్తకాలను భరత్ కుమార్‌కు పార్టీ సీనియర్ నాయకులు సుంకర వెంకటేశ్వరరావు చేతుల మీదుగా బొడ్డేడ శివ అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మందపాటి జానకి రామరాజు, కేయం నాయుడు, బుద్ధ జగన్, కాంగ్రెగుల వెంకట సాంబ శివ, తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని మొగలిపురం గ్రామంలో సోమవారం రాత్రి మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటిసంతకాలు సేకరణ కార్యక్రమం నిర్వహించారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి గండి రవికుమార్ పాల్గొని ఇంటింటికి వెళ్లి సంతకాలు సేకరణ చేశారు. ఉప సర్పంచ్ సిరపు రపు వాసు, వైసిపి నేతలు ఐడి. బాబు, అంగటి సూర్యనారాయణ, ఐ.గోపి, పి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తగరపువలస : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జివిఎంసి 2వ వార్డు పరిధిలోని రైతు బజార్ వద్ద వైసిపి కోటి సంతకాల సేకరణ చేపట్టారు. డెబ్బీర్ ప్రశాంత్ పట్నాయక్ ఆధ్వర్యంలో ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో కొయ్య వెంకటలక్ష్మి, దుర్రి రావియమ్మ, అక్కరమాని మంగరాజు, జీరు వెంకటరెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, చిప్పాడ వెంకటేష్ పాల్గొన్నారు.



కె.రాజుకు జాబితా అందజేస్తున్నమేరువ గణేష్

సంతకాల సేకరణ జాబితా అందజేత

సీతమ్మధార : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యాన చేపట్టిన సంతకాల సేకరణ జాబితాను పార్టీ కార్యాలయంలో కెె.రాజుకు 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ మంగళవారం అందించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు వేణు, 55 వార్డు కార్పొరేటర్ కెవిఎన్.శశికళ, ఐటి వింగ్ జిల్లా అధ్యక్షుడు మేరువ గణేష్, నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, గాలి ప్రసాద్, హరి, కె.రామారెడ్డి, బాధ శ్రీనివాస్, రేవతిరావు తదితరులు పాల్గొన్నారు రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి బాబాలా తరుణ్, గ్రీవెన్స్ విభాగం అధ్యక్షుడు కె.రామారెడ్డి ఆధ్వర్యాన మరో జాబితాను కె.రాజుకు అందజేశారు.

భారతీయ సంస్కృతిపై పరిశోధన

ప్రజాశక్తి- అరకులోయ : భారతీయ సంస్కృతి, ఇక్కడి ఆచార వ్యవహారాలు ప్రత్యేకమని అమెరికాకు చెందిన విదేశీ పర్యాటకులు క్రిస్టోఫర్, ఆయన సతీమణి ఇన్సూక్ రోషర్ అన్నారు. భారతదేశంలోని సంస్కృతి, విద్యపై చేస్తున్న పరిశోధనలో భాగంగా అల్లూరి మన్యంలో పరిస్థితులపై అధ్యయనంలో భాగంగా మంగళవారం అరకులోయ మహిళా డిగ్రీ కళాశాలను సందర్శించారు. కళాశాలలో విద్యాబోధన, జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా పరిశీలించడంతోపాటు కళాశాల ప్రిన్సిపల్ పట్టాసి చలపతిరావు, కళాశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ముచ్చటించి, వారికి పలు సూచనలు చేశారు.

నేడు నక్కపల్లిలో ప్రజాదర్బార్

గుడివాడలో రైతులతో హోంమంత్రి ముఖాముఖి


హోంమంత్రి అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లిలోని హోంశాఖ మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రజా దర్బార్ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనిత పాల్గొని, ప్రజల నుండి వినతులు స్వీకరిస్తారు. అలాగే బుధవారం ఉదయం 10 గంటలకు ఎస్ రాయవరం మండలం, గుడివాడ గ్రామంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో హోంమంత్రి అనిత పాల్గొంటారు.

చిత్రలేఖనం పోటీల్లో రోహిత్‌కు స్వర్ణం


రోహిత్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- మాడుగుల : ఇటీవల చెన్నైలో జరిగిన బాలల చిత్రలేఖనం పోటీల్లో మాడుగుల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి జాతీయ స్థాయిలో ప్రతిభను కనబరిచి, గోల్డ్ మెడల్ సాధించాడు. చెన్నైలోని శ్రీదర్శిని కళాయికూడమ్ సంస్థ 21వ వార్షికోత్సవం సందర్భంగా ధర్మలింగమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. చోడవరం చిత్రకళా నిలయానికి చెందిన ఎనిమిది మంది విద్యార్థులు మెడల్స్ సాధించి అద్భుత విజయాన్ని నమోదు చేశారు. మాడుగులకు చెందిన పుట్టా రోహిత్ గోల్డ్ మెడల్ సాధించాడు. మంగళవారం రోహిత్‌ను పాఠశాలలో స్కూల్ చైర్మన్ జొన్నపల్లి రమేష్, ప్రధానోపాధ్యాయుడు ముత్యాలనాయుడు, ఉపాధ్యాయులు గ్రామపెద్దలు అభినందించారు.

సిబ్బంది అందుబాటులో ఉండాలి

పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పి


సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పి తుహిన్ సిన్హా

ప్రజాశక్తి - పాయకరావుపేట: పోలీసుల అధికారులు, సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా ఆదేశించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు.. ముందుగా స్టేషన్ రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులు, శాంతిభద్రతల పరిస్థితులపై సిఐ అప్పన్న, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సరికాదని, స్థానికంగా ఉండాలన్నారు. అలాగే ట్రాఫిక్ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూఉండాలని సిఐకి ఆదేశించారు. దీంతోపాటు సిబ్బందికి పలు జాగ్రత్తలు తెలిపారు. . సిబ్బంది నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎస్పి తుహిన్ సిన్హా హెచ్చరించారు. నర్సీపట్నం డిఎస్పి శ్రీనివాసరావు ఉన్నారు.

పెంచలయ్య హత్యపై నిరసన

• ఐద్వా, ప్రజాసంఘాల ఆధ్వర్యాన కొవ్వొత్తుల ప్రదర్శనలు



నర్సీపట్నంలో ఐద్వా, ప్రజాసంఘాల కొవ్వొత్తులతో నిరసన

ప్రజాశక్తి- నర్సీపట్నం రూరల్ : గంజాయి, మత్తు పదార్థాల మాఫియాకు అడ్డంగా ఉన్నాడన్న కారణంతో నెల్లూరులో ప్రజానాట్యమండలి యువ కళాకారుడు పెంచలయ్యను అతి దారుణంగా నరికి చంపినందుకు నిరసనగా మంగళవారం నర్సీపట్నం పాల్గాట్ సెంటర్లో ఐద్వా ఆధ్వర్యంలో వెలిగించిన కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకులు కెవి సూర్యప్రభ, ఎల్.గౌరీ మాట్లాడుతూ పాఠశాల నుంచి తన పిల్లలను ఇంటికి తీసుకువస్తుండగా దారికాచి పెంచలయ్యను కిరాతకంగా చంపడాన్ని ఐద్వా తీవ్రంగా ఖండిస్తుందన్నారు .హంతకుల ముఠా నాయకురాలు ఆరవ కామాక్షిని, ముఠా సభ్యులనుకఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనతో రాష్ట్రమంతా అట్టుడికిపోతున్నా, ప్రభుత్వ పెద్దలు స్పందించకపోవడం అన్యాయం అన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి పెంచలయ్య కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జనవిజ్ఞాన వేదిక నాయకులు కె. త్రిమూర్తులు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి చిరంజీవి, విద్యార్థులు పాల్గొన్నారు.

పరవాడ : నెల్లూరుకు చెందిన ప్రజానాట్యమండలి నాయకుడు పెంచలయ్యను గంజాయి మాఫియా దారుణంగా హత్య చేసిన ఘటనపై అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యాన పరవాడ కాలనీలో బుధవారం మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం, జాయింట్ సెక్రటరీలు తుంపాల పూర్ణ, మన్యాల బంగారమ్మ మాట్లాడుతూ పెంచలయ్య ప్రజలను చైతన్యం చేసే ప్రజానాట్య మండలి కళాకారుడని, ఆయన్ను గంజాయి మాఫియా క్రూరంగా హత్య చేయడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. మద్యం, గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఇటువంటి దారుణాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని


పరవాడలో నిరసన వ్యక్తం చేస్తున్న ఐద్వా నేతలు


కశింకోటలో నిరసన వ్యక్తం చేస్తున్న ఐద్వా నేతలు

కోరారు. పెంచలయ్య కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అలేఖ్య, సాయి, రాజ్ కుమారి, రమా, నాగమణి, రామకృష్ణమ్మ, వెంకట సత్య సాయి, రాధా, సీత, లీలావతి, లక్ష్మి, రాజేశ్వరి, మేరీ పాల్గొన్నారు.

కశింకోట : పెంచలయ్యను గంజాయి మాఫియా హత్య చేయడంపై ఐద్వా ఆధ్వర్యంలో మండలంలోని నరసింగబిల్లి గ్రామంలో మంగళవారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు, ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి.వరలక్ష్మి మాట్లాడుతూ పెంచలయ్య కుటుంబానికి న్యాయం చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు శివలక్ష్మి, ఏ.సాయికుమార్, ఎం.తులసి, ఎం.భవాని, సి.హెచ్. అమ్మాజీ, దేవి, చిన్నమ్ములు, ఏ.పద్మ, ఎస్.చిలుకమ్మ, పి.భారతి, సీఐటీయూ నాయకులు దాకారపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలులో నిర్లక్ష్యం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య



మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విస్మరించి, ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంబిస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య విమర్శించారు. మంగళవారం అల్లిపురంలోని సిపిఐ కార్యాలయంలో పార్టీ జిల్లా సమితి సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు రూ.1500 నగదు సాయం ఏమైందని ప్రశ్నించారు వైద్య కళాశాలల్లో 47 శాతం సీట్లను అమ్మేందుకు వీలుగా గత వైసిపి ప్రభుత్వం జారీ చేసిన 107, 108 జిఒలను రద్దు చేస్తామన్న హామీ అమలు చేయకపోగా, వైద్య కళాశాలల ప్రైవేటీకరణతో 100 శాతం సీట్లను విక్రయించే వీలు కల్పించారని విమర్శించారు పిపిపి పద్ధతిలో 35ఏళ్ల లీజుకు ప్రభుత్వ వైద్యకళాశాలలు ఇవ్వడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో చక్కెర ఫ్యాక్టరీలు, స్పిన్నింగ్ మిల్లులు, ఫెర్రో పరిశ్రమలు మూతబడుతున్నా వాటిపై దృష్టిపెట్టకుండా, కొత్త పెట్టుబడులకు వెంపర్లాడడం సిగ్గుచేటన్నారు. విశాఖలో 450 కోట్ల విలువైన భూములను టిసిఎస్‌కు ఎకరం 99 పైసలకే కట్టబెట్టారని, అధికారంలోకి వచ్చిన కొద్దిసమయంలోనే కూటమి ప్రభుత్వం రూ.2 లక్షల కోట్లు అప్పు చేసిందన్నారు.. తెల్ల ఏనుగు అంటూ విశాఖ స్టీల్ ప్లాంట్‌పై చంద్రబాబు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. షిరిడి సాయి ఎలక్ట్రికల్స్ జగన్ బినామీ కంపెనీ అని గొంతు చించుకున్న చంద్రబాబు ప్రకాశం జిల్లాలో ఆ కంపెనీకి 8400 ఎకరాల భూములు కేటాయించారని విమర్శించారు.ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అశాస్త్రీయ భావజాలాన్ని వ్యాపింపచేస్తూ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. మొంథా తుఫాను బాధిత రైతుల సమస్యలపై .ఈ నెల 10న, వైద్య కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 18 న ఆందోళనలకు పిలుపునిచ్చారు.వచ్చేనెల 18న ఖమ్మంలో సిపిఐ శతవార్షిక సభను విజయవంతం చేయాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ రెహమాన్ అధ్యక్షతన సమావేశంలో జాతీయ సమితి సభ్యుడు జె.వి సత్యనారాయణమూర్తి, రాష్ట్ర సమితి సభ్యుడు ఎం.పైడిరాజు, జిల్లా సహాయ కార్యదర్శులు కె.సత్యనారాయణ, పి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న యువత

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని సీతయ్యపేట గ్రామానికి చెందిన యువకులు తమతో చదువుకున్న స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన కాండ్రకోట శ్రీను తండ్రి అనారోగ్యంగా బాధపడుతుండడంతో వారి ఆర్థిక పరిస్థితి సరిగా లేదు. సదరు కుటుంబానికి అసరాగా నిలవాలని భావించిన మిత్రులందరూ రూ.22 వేలు పోగుచేసి మంగళవారం అందజేశారు. తోటి మిత్రుడికి ఆర్థికసాయం చేసిన యువతను బాధిత కుటుంబీకులతోపాటు పలువురు అభినందించారు. కార్యక్రమంలో సీఎం శివ, వై.శ్రీను, టి.రాజు, ఎం.సతీష్, వి.లోవరాజు పాల్గొన్నారు.

సమస్యలపై మున్సిపల్ కార్మికుల వినతి


వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి- నర్సీపట్నం రూరల్ : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. సమ్మె ఒప్పందంలో భాగంగా 12వ పిఆర్‌సి కమిటీని వేసి వేతనాలు పెంచాలని, రిటైర్మెంట్ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని, ఉద్యోగ విరమణ పొందిన, అలాగే మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబసభ్యులకు ఉపాధి కల్పించాలని. కోవిడ్ సమయంలో సేవలు అందించి విధులు నుంచి తొలగించిన కార్మికులకు భవిష్యత్తులో భర్తీ చేయు ఉద్యోగాల్లో అవకాశం కల్పిస్తామన్న హామీని అమలు చేయాలన్నారు. పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా కార్మికులను నియమించి, ఉన్నవారిపై పని భారం తగ్గించాలని కోరారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ స్పందిస్తూ కార్మికుల సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తామని భరోసానిచ్చారు.కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, యూనియన్ నాయకులు వి.రమణ, ఎం. బాబూరావు, లవరాజు, దుర్గ హేమంత, ఈశ్వరరావు పాల్గొన్నారు.